


అమ్మ పండగ.. అఖిలం నిండుగ

నేటి నుంచి దసరా వేడుకలు

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే ఇంద్రకీలాద్రి

దుర్గమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఇంద్రకీలాద్రి కొండ దిగువన వినాయక ఆలయం వద్ద నుంచి క్యూలైన్లను వేశారు. భక్తులు ఒకసారి క్యూలైన్లలోకి ప్రవేశించాక.. రెండు కిలోమీటర్ల దూరం నడిచి వచ్చి ఘాట్ రోడ్డు మీదుగా వెళ్లి అమ్మవారిని దర్శించుకోనున్నారు. అనంతరం శివాలయం మెట్ల మార్గానికి పక్కనే ఏర్పాటు చేసిన తాత్కాలిక మార్గం, మహామండపంలో ర్యాంప్, మెట్ల మార్గం ద్వారా భక్తులు కిందకు దిగనున్నారు. సరిగ్గా భక్తులు కిందకు దిగే ప్రాంతంలోనే అన్నదాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అన్నప్రసాదం స్వీకరించిన తర్వాత.. పక్కనే కనకదుర్గానగర్‌లో లడ్డూ ప్రసాదం కౌంటర్లను ఏర్పాటు చేశారు. గురువారం నుంచి ఆరంభమయ్యే దసరా వేడుకలు.. ఈనెల 12 వరకూ జరగనున్నాయి. దసరా తొమ్మిది రోజుల్లో.. అమ్మవారు తొమ్మిది రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

దర్శనాల సమయాలు...

ప్రతిరోజు ఉదయం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ భక్తులను అమ్మవారి దర్శనాలకు అనుమతిస్తారు. తొలి రోజు మాత్రం ఉదయం 9 గంటల తర్వాత నుంచి దర్శనాలు ఆరంభమవుతాయి.

తొలిరోజు ఉదయం 9 గంటల నుంచి దర్శనాలు

ఇంద్రకీలాద్రిపై ఘనంగా ఏర్పాట్లు

ఈసారి దసరా వేడుకలు జరిగే తొమ్మిది రోజులు, అనంతరం ఈనెల 13, 14 వరకూ అంతరాలయం దర్శనాలు పూర్తిగా ఆపేస్తున్నట్లు ప్రకటించారు. ముఖమండప దర్శనాలకు మాత్రమే అనుమతిస్తారు. ప్రతిరోజు సాయంత్రం 6.30 నుంచి 7.30 వరకు అమ్మవారి మహానివేదన, పంచహారతులు నిర్వహిస్తారు. ఆ సమయంలో భక్తుల దర్శనాలను గంట సమయం పూర్తిగా ఆపేస్తారు.

25 లక్షల లడ్డూలు..

భక్తులకు విక్రయించేందుకు 25 లక్షల లడ్డూలను దసరా వేడుకల కోసం ముందస్తుగానే సిద్ధం చేస్తున్నారు. వీటిని విక్రయించేందుకు 18కౌంటర్లు ఏర్పాటు చేశారు. కొండ దిగువన కనకదుర్గానగర్‌లో 10, మిగతా ఘాట్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్, స్టేట్ గెస్ట్‌హౌస్ వంటిచోట్ల ఒక్కొక్కటి చొప్పున ఎనిమిది కౌంటర్లను ఏర్పాటు చేశారు.



విద్యుత్తు కాంతుల్లో ఇంద్రకీలాద్రి



టిక్కెట్, ఉచిత క్యూలైన్లు..

ఐదు క్యూలైన్లలో భక్తులు అమ్మవారిని దర్శించుకోనున్నారు. వీటిలో రెండు ఉచిత దర్శనం లైన్లు. మిగతావి రూ.100, రూ.300, రూ.500 క్యూలైన్లు. దర్శన టిక్కెట్లను భక్తులకు విక్రయించేందుకు 14 చోట్లా కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో రిసెప్షన్, టోల్‌గేటు, ఓం టర్నింగ్, సహా అన్ని ఘాట్లు, కలెక్టర్ కార్యాలయం, స్టేట్‌గెస్ట్ హౌసు, బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో కౌంటర్లు ఉన్నాయి.



పుష్కలంగా తాగునీళ్లు..

ఉత్సవాలకు తరలివచ్చే భక్తుల కోసం 35 లక్షల తాగునీటి ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశారు.

వీఐపీ, వృద్ధులు, దివ్యాంగులకు..

సాధారణ భక్తుల దర్శనాలకు ఆటంకం కలగకుండా ఉండేలా వీఐపీ, వీవీఐపీ దర్శనాలు, వృద్ధులు, దివ్యాంగుల దర్శనాలకు ఈ ఏడాది ప్రత్యేక సమయాలను కేటాయించారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల మధ్యలో కేటాయించారు. ఈ సమయాల్లోనే రావాలని సూచించారు. ప్రముఖుల రాకపోకల కోసం పున్నమిఘాట్, కలెక్టర్ కార్యాలయం, స్టేట్‌గెస్ట్ హౌస్, భవానీ ఘాట్, జమ్మిదొడ్డి ప్రాంతాల నుంచి 28 ఇన్నోవా వాహనాలు, ఎనిమిది మినీ బస్సులను ఏర్పాటు చేశారు.



దివ్యాంగుల కోసం ప్రత్యేక ఎస్కలేటర్

ఉచిత ప్రసాదం, అన్నదానం..

ఆలయంలో తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకూ భక్తులకు ఉచిత ప్రసాదంగా పులిహోర, కట్టె పొంగలి, దద్దోజనం, సాంబారు అన్నం అందిస్తారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు కొండ దిగువన ఏర్పాటు చేసిన శిబిరంలో అమ్మవారి అన్నప్రసాదం అందుబాటులో ఉంటుంది.

తాత్కాలిక మరుగుదొడ్లు..

150 తాత్కాలిక మరుగుదొడ్లను విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. భక్తులు వేచి ఉండేందుకు సీతమ్మ వారి పాదాల వద్ద వేసిన షెడ్ వద్ద 40, బస్టాండ్, రాజీవ్‌గాంధీ పార్కు, కృష్ణవేణిఘాట్, కుమ్మరిపాలెం టీటీడీ పార్కింగ్ స్థలం, కెనాల్ రోడ్డు, భవానీఘాట్లలో 10 చొప్పున మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

ప్రతిరోజూ నగరోత్సవం..



ప్రతిరోజు సాయంత్రం 4గంటలకు నగరోత్సవం కనులపండువగా నిర్వహిస్తారు. మహామండపం నుంచి బయలుదేరి కనకదుర్గానగర్, రథం సెంటర్, వినాయకగుడి వరకూ వెళ్లి.. యూటర్న్ తీసుకుని కెనాల్ రోడ్డు మీదుగా ఆలయ ఘాట్‌రోడ్డు మీద నుంచి ఆలయంలోకి ప్రవేశిస్తుంది.



ఆలయ పరిసరాలు ముస్తాబు

ఘాట్లలో జల్లు స్నానాలకు ఏర్పాట్లు..

భవానీఘాట్, సీతమ్మవారి పాదాలు, పున్నమి ఘాట్లలో 700 షవర్లను ఏర్పాటు చేశారు. వీటిలో సీతమ్మవారి పాదాల ఘాట్ వద్దే 500 షవర్లు ఉన్నాయి. భక్తులు వీటి కింద నిలబడి జల్లు స్నానాలు చేసుకునేలా సౌకర్యాలు కల్పించారు. కొండ దిగువన దుర్గాఘాట్‌లో భక్తుల స్నానాలకు అనుమతి లేదు. ఇక్కడ నదీ హారతి కార్యక్రమాన్ని ప్రతిరోజు సాయంత్రం వేళ నిర్వహించనున్నారు.

కేశఖండనశాల...

సీతమ్మవారి పాదాల వద్ద కేశఖండనశాలను ఏర్పాటు చేశారు. ఒక్కో షిఫ్టుకు 200 మంది చొప్పున.. మొత్తం మూడు షిఫ్టుల్లో 600 మంది క్షురకులు అందుబాటులో ఉంటారు. భవానీ, పున్నమిఘాట్ల వద్ద కూడా 25మంది చొప్పున బార్బర్లను ఉంచుతున్నారు. హైదరాబాద్ వైపు నుంచి వచ్చే భక్తులు అక్కడే తలనీలాలు సమర్పించి.. ఘాట్‌లో స్నానం చేసి అమ్మవారి దర్శనానికి రావొచ్చు.

భద్రతా వలయం....

దుర్గగుడి, ఘాట్లు, విజయవాడ సహా చుట్టుపక్కల మూడు షిఫ్టుల్లో 5,200 మంది పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొంటున్నారు. ఆలయంలో ఉన్న 200 సీసీ కెమెరాలతో ఉత్సవాలను డేగ కళ్లతో పర్యవేక్షించనున్నారు. ఇవికాక అదనంగా మరికొన్ని కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టరేట్, పోలీసు కమిషనర్ కార్యాలయం, కమాండ్ కంట్రోల్ రూమ్‌ల వద్ద మానిటర్లను ఏర్పాటు చేసి 24 గంటలూ పర్యవేక్షించేలా సిబ్బందిని ఏర్పాటు చేశారు.



రాజగోపురం వద్ద పోలీసులు



దసరా మహోత్సవాలను పురస్కరించుకొని నగర పోలీసుల తరఫున సీపీ రాజశేఖర్ బాబు దంపతులు.. దుర్గమ్మకు తొలి సారెను బుధవారం సంప్రదాయ పద్ధతిలో సమర్పించారు.

బందరుకు పూర్వ వైభవం తెస్తా

స్వచ్ఛతాహీ సేవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ



బందరు పోర్టు పనులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు. పక్కన ఎంపీ బాలశౌరి




చీపురుపట్టి వ్యర్థాలను శుభ్రం చేస్తున్న ముఖ్యమంత్రి. పక్కన మంత్రులు నారాయణ, కొల్లు రవీంద్ర

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: బందరుకు పూర్వ వైభవం తీసుకొస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మచిలీపట్నంలోని తితిదే కల్యాణ మండపంలో నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన బందరు చరిత్ర, స్వాతంత్ర్యోద్యమంలో ఇక్కడి నుంచి కీలకంగా వ్యవహరించిన ఉద్యమకారుల గురించి వివరించారు.

ఆంధ్ర జాతీయ కళాశాలకు మహర్దశ

'గాంధీజీ పర్యటించిన ఆంధ్ర జాతీయ కళాశాల వైకాపా ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో వెలవెలబోతోంది. కళాశాల భూములను కూడా కబ్జా చేసేందుకు కొందరు అక్రమార్కులు ప్రయత్నిస్తున్నారు. కళాశాల అభివృద్ధి బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది. ఉద్యమకారులను దేశానికి అందించిన కళాశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. దేవాదాయశాఖ పరిధిలోని కళాశాలను తీసుకుని వసతు కల్పిస్తా'మన్నారు.



స్వచ్ఛ చల్లపల్లి రథసారథి డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్‌ను సన్మానించిన సీఎం చంద్రబాబు

బందరుకు సీఎం వరాల జల్లు

'మంగినపూడి బీచ్‌ని పర్యాటకంగా అన్ని వసతులతో అభివృద్ధి చేస్తాం. నగరంలో ప్రధానమైన డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరిస్తాం. ఐవీఆర్ఎస్ ద్వారా నగరంలోని కొందరికి ఫోన్‌లు చేసి సమస్యలపై ఆరా తీయగా ఎక్కువ శాతం డ్రెయినేజీ, రహదారుల సమస్యలు చెప్పారని' సీఎం పేర్కొన్నారు. డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి ఇప్పటికే కార్యాచరణ చేపట్టామని, భౌగోళికంగా నగరం పల్లంగా ఉండంతో అవసరమైతే ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసి నగరంలో నీరు నిలవకుండా చూస్తామన్నారు. రహదారులను అభివృద్ధి చేస్తామని, మత్స్యకారులకు ఉపాధి, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నామన్నారు.

రోల్డ్‌గోల్డ్ పరిశ్రమ అభివృద్ధి

'బందరు రోల్డ్‌గోల్డ్ పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, కావాల్సిన నిధులను మంత్రి రవీంద్ర నా దృష్టికి తెచ్చారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటాం. చిలకలపూడి రోల్డ్‌గోల్డ్ నగలకు ఆన్‌లైన్ మార్కెటింగ్ కల్పించి అంతర్జాతీయ స్థాయిలో విక్రయాలు జరిగేలా చూస్తాం. కలంకారీ పరిశ్రమను కూడా అభివృద్ధి చేసి ఆన్‌లైన్ విక్రయాలు జరిగేలా చూస్తాం. జలజీవన్ మిషన్‌తో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తా'మన్నారు.

వైకాపా కార్యాలయ భవనంపై నివేదిక

నగరం నడిబొడ్డున రెండెకరాల ప్రభుత్వ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా వైకాపా కార్యాలయ భవన నిర్మాణానికి అనుమతులు తదితరాలపై నివేదిక తీసుకుని తగు చర్యలు తీసుకుంటామన్నారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారకభవన నిర్మాణ అంశాన్ని కూడా పరిశీలిస్తామని సీఎం పేర్కొన్నారు.

తెదేపా హయాంలో ప్రగతి

కొల్లు రవీంద్ర, మంత్రి

బందరులో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది తెదేపా హయాంలోనే.



స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నగరంలో తెదేపా హయాంలోనే రిజర్వాయర్ల నిర్మాణం జరిగింది. 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత 8 రిజర్వాయర్లు, పైపులైన్ నిర్మాణం తదితర పనులు చేపట్టాం. ప్రస్తుతం బందరు మండలంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి ఇచ్చేందుకు రూ.220కోట్లు సిద్ధంగా ఉన్నాయి. త్వరిత గతిన పనుల పూర్తికి కృషి చేస్తున్నాం.



బందరు వైద్య కళాశాలకు పింగళి వెంకయ్య పేరు

ఫలించిన ఎంపీ బాలశౌరి కృషి

దేశానికి మువ్వన్నెల జెండాను అందించిన పింగళి వెంకయ్య పేరు మచిలీపట్నంలో ఇక చిరస్థాయిలో నిలిచిపోనుంది. మచిలీపట్నానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు పింగళి పేరును మచిలీపట్నం వైద్య కళాశాలకు పెడతామని సీఎం చంద్రబాబు ప్రకటించడంతో.. మహనీయునికి ఘన నివాళి అర్పించినట్లయింది. ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషి ఎట్టకేలకు ఫలించింది. వైద్య కళాశాలకు నిధులు కేటాయించినప్పటి నుంచి.. పింగళి వెంకయ్య పేరు పెట్టాలని బాలశౌరి విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వానికి విన్నవిస్తూనే ఉన్నారు. తాజాగా ముఖ్యమంత్రి స్వయంగా పింగళి పేరు ప్రకటించడంతో బందరులో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. దేశ స్వాతంత్ర్యోద్యమంలో పింగళి పోరాటం మరువలేనిది. కృష్ణా జిల్లాలో పుట్టి.. దేశానికి మువ్వన్నెల పతాకాన్ని రూపొందించి ఇచ్చి.. జాతిపిత గాంధీజీ మెప్పు పొందిన పింగళి పేరును వైద్య కళాశాలకు పెట్టడం శుభ పరిణామం.

అభినందనీయం: ఎంపీ బాలశౌరి



బందరు ప్రభుత్వ వైద్య కళాశాలకు పింగళి వెంకయ్య పేరు పెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం అభినందనీయం. వైద్య కళాశాల నిర్మాణం వేళనే ఆయన పేరు పెట్టాలని కోరగా అప్పటి ఎమ్మెల్యే అహంకారంతో సాధ్యపడలేదు. కూటమి ప్రభుత్వంలో సమరయోధునికి గౌరవం దక్కనుంది. పింగళి పేరు పెట్టాలని గతంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు లేఖ రాశా. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక చంద్రబాబు తొలిసారి బందరు పర్యటనలోనే శుభవార్త చెప్పారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. వరదల వేళ సీఎం చొరవ ఆదర్శనీయం. 15లక్షల క్యూసెక్కుల వరదవచ్చినా ఇబ్బంది లేకుండా కరకట్టలను బలోపేతం చేయాలి.

తినమరిగినోళ్లు.. వదలరంతే!

పోలవరం కట్టలపై తవ్వకాలు ✳ రెండు జేసీబీలు, టిప్పర్లు స్వాధీనం

ఈనాడు, అమరావతి

గత ప్రభుత్వంలో పోలవరం కుడి కాలువ కట్టలను దాదాపు కరిగించారు. విచ్చలవిడిగా తవ్వారు. కొంత అనుమతి తీసుకుని జలవనరుల శాఖ ఆధ్వర్యంలో తవ్వితే.. మరికొంత అనధికారికంగా మాయం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా.. తవ్వకాలు మాత్రం ఆగడం లేదు. ఎలాంటి అనుమతులు లేకుండా కొద్దోగొప్పో ఉన్న కట్టలను తవ్వేస్తున్నారు. తమకు ఎమ్మెల్యే చెప్పారని.. అధికారులను సైతం బుకాయిస్తున్నారు. విచిత్రం ఏంటంటే.. గత ప్రభుత్వంలో తవ్విన నేతలే.. ప్రస్తుత ప్రభుత్వంలోనూ తవ్వేస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ఎలాంటి సీనరేజీలు లేకుండా మట్టిని తరలిస్తున్నారు. మౌఖిక ఆదేశాలు ఉన్నాయని క్షేత్రాకి వెళ్లిన అధికారులను బుకాయిస్తున్నారు.



పాతపాడు వద్ద పోలవరం కట్ట తవ్వకాలు

గండ్లు పూడ్చే పేరుతో..!

ఇటీవల వరదలకు పలు చోట్ల గండ్లు పడ్డాయి. దారులకు గండ్లు పడగా.. కొన్ని అధికారులే నీరు ప్రవహించేందుకు వీలుగా గండ్లు కొట్టారు. ఇలా పడిన గండ్లు పూడ్చేందుకు మట్టి పెద్దఎత్తున అవసరం. ఈ గండ్లు పూడ్చేందుకు దగ్గరలో పోలవరం కట్టల నుంచి తవ్వాలని తమకు ఆదేశాలు ఉన్నాయని కొందరు విచ్చలవిడిగా తవ్వేసి తరలిస్తున్నారు. ప్రైవేటు వెంచర్లకు విక్రయిస్తున్నారు. వాస్తవానికి గండ్లు పూడ్చేందుకు తాము ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని అధికారులు చెబుతున్నారు. పోలవరం కుడి కాలువ కట్టపై పాతపాడు సమీపంలో రెండు జేసీబీలు పెట్టి ఓ వైకాపా నాయకుడు లారీలలో మట్టిని తరలించడంపై అధికారులకు ఫిర్యాదులు అందాయి. సోమవారం ఆ ప్రాంతంలో పలు లారీలు, ట్రాక్టర్లలో రెండు జేసీబీలు తవ్వుతున్న తీరు 'ఈనాడు'కు కనిపించింది. దీనిపై కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే చాలా వరకు తవ్వకాలు జరిపారు. దీనిపై ప్రశ్నించిన స్థానికులతో వాగ్వాదానికి దిగారు. తమకు ఎమ్మెల్యే చెప్పారనీ.. గండ్లు పూడ్చేందుకు తీసుకెళుతున్నామని భిన్నమైన వాదనలు వినిపించారు. ఈ తవ్వకాల విషయమై మరో ఎమ్మెల్యేకు సమాచారం అందడంతో ఆయన రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. పోలవరం కట్టలతోపాటు పలు ప్రాంతాల్లోనూ ఇంకా మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. పోలవరం కట్టలపై గత ప్రభుత్వంలో జరిపిన తవ్వకాలపై విచారణ జరుగుతూనే ఉంది. గన్నవరంలో స్వయంగా జలవనరుల శాఖ అధికారులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులకే దిక్కు లేదు. నేటికీ కేసు నమోదు చేయకుండా వదిలేశారు. నాడు ప్రజాప్రతినిధులు కీలకంగా వ్యవహరించి మట్టి తవ్వకాలను ప్రోత్సహించారు.

రెండు జేసీబీలు పట్టివేత..!

ఫిర్యాదు అందిన వెంటనే విజయవాడ గ్రామీణ తహసీల్దారు సుగుణ ఆ ప్రాంతాన్ని పరిశీలించి రెండు జేసీబీలను స్వాధీనం చేసుకున్నారు. రెండు టిప్పర్లను పట్టుకున్నారు. దీనిపై ఇంకా కేసు నమోదు కాలేదు. ఓ ఎమ్మెల్యే చెప్పారని ఒక వర్గం వాదిస్తుండగా.. మరో ఎమ్మెల్యే చర్యలు తీసుకోమని ఆదేశాలు ఇచ్చారని అధికారులు చెబుతున్నారు. ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య ఈ మట్టి తవ్వకాలు వివాదంగా మారాయి. మరో కాంట్రాక్టరు ఈ పోలవరం కట్ట మట్టి తనదనీ.. తాను జలవనరుల శాఖకు దరఖాస్తు చేశానని సొమ్ములు కూడా చెల్లించానని చెబుతున్నారు.

కోలవెన్ను ఛానల్ కబ్జా!

లేఔట్ వ్యాపారి బరితెగింపు

సాగునీరు అందే పరిస్థితి లేదని రైతుల ఆందోళన

పెనమలూరు, న్యూస్‌టుడే

వందల ఎకరాలకు సాగునీరందించే కోలవెన్ను ఛానల్‌కు కష్టమొచ్చింది. అక్రమ లేఔట్ల వ్యాపారంలో చేయి తిరిగిన ఓ వ్యాపారి చేతుల్లో పడి బక్కచిక్కిపోతోంది. విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి పక్కనే సాగుతున్న ఈ వ్యవహారం పెనమలూరు, కంకిపాడు మండలాల్లో దుమారం రేపుతోంది. ఇందులో రూ.లక్షలు చేతులు మారాయనే ప్రచారాలు సాగుతుండగా రెవెన్యూ శాఖకు చెందిన ఓ డిప్యూటీ తహసీల్దారు స్థాయి అధికారి ప్రమేయం పైనా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బదిలీ సమయాన్ని ఆసరాగా తీసుకుని..

గత 15 రోజులుగా జలవనరుల శాఖలో బదిలీల వ్యవహారం సాగుతోంది. దీంతో స్థానికంగా అధికారులు అందుబాటులో లేకపోవడం, పర్యవేక్షణ తగ్గింది. దీన్ని ఆసరాగా తీసుకుని టిప్పర్ల కొద్దీ కొండ, బండరాళ్లు, భవనాల శిథిలాలను రాత్రి సమయాల్లో తీసుకు వచ్చి కాలువ అంచుల్లో కుమ్మరించి రోడ్డు రోలర్ల సాయంతో కాలువ వైపు వెడల్పు చేయడం మొదలెట్టారు. వారం రోజులుగా ఈ తంతు జరుగుతున్న రెండ్రోజుల కిందట రైతుల కంటపడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు అన్నదాతలు కోరుతున్నారు.

కాలువపై ప్రైవేటు పెత్తనం

కోలవెన్ను ఛానల్ గోసాల వద్ద బందరు కాల్వ నుంచి ప్రారంభమై 7.5 కి.మీ పొడవునా కంకిపాడు మండలం కోలవెన్ను శివారు వరకు కొనసాగుతోంది. ఈ సాగునీటితో ఈడుపుగల్లు, గోసాల, కంకిపాడు, పునాదిపాడు, కోలవెన్ను పరిధిలోని దాదాపు 1500 ఎకరాల మాగాణి సాగవుతోంది. కాలువ నుంచి దాదాపు 16 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంటుంది. ఈ నేపథ్యంలో ఓ లేఔట్ల వ్యాపారి దీనిపై గుత్తాధిపత్యం సాగిస్తున్నాడు. జాతీయ రహదారికి కూతవేటు దూరంలో వేస్తున్న లేఔట్లను ఖరీదైన ధరకు అమ్మేసుకోవడానికి ఈ కాలువ, దాని కట్టపై పట్టు బిగించాడు. దాదాపు ఫర్లాంగు దూరం అంచుల నుంచి కాలువ వైపు బండరాళ్లు, భవనాల శిథిలాల పోసి పూడ్చుకుంటూ వస్తూ రహదారిని తన లేఔట్‌కు అనుకూలంగా ఎడాపెడా వెడల్పు చేసుకుంటూ వస్తున్నాడు. ఇప్పటికే కాలువలో తూటికాడ, పిచ్చిచెట్లతో నిండిపోయి నీటి సరఫరా అంతంత మాత్రంగా ఉండగా తాజాగా ఈ వ్యవహారంతో నీరు పారుదలకు మరిన్ని ఆటంకాలు ఎదురయ్యేలా ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.


అక్రమంగా వేస్తున్న లేఔట్ ఇదే..


కాల్వలో కుమ్మరించిన బండరాళ్లు, భవనాల శిథిలాలు

సీఆర్‌డీఏ ఏం చేస్తోంది..?

సీఆర్‌డీఏ అధికారుల తీరుపై నాలుగు గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే ఈ తతంగం జరుగుతున్నా పేలవంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. దీనిపై సమాచారం ఉన్నా అధికారులు చూసీ చూడనట్లు పోతున్నారని మండి పడుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

బుధవారమే ఉద్యోగ బాధ్యతలు స్వీకరించా. లేఔట్ల వ్యాపారి నిర్వాకంపై మాకు ఫిర్యాదులు అందాయి. రైతులు, మా శాఖ సిబ్బంది వీడియోలు తీసి పంపారు. కాలువ కట్టను వెడల్పు చేయడం, అంచులను పూడ్చివేసే ప్రయత్నాలు సాగుతున్నట్లు సమాచారం ఉంది. మా శాఖ నుంచి వీటికి ఎటువంటి అనుమతులు లేవు. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. కేసులు పెడతానికి వెనుకాడం.


- నాగబాబు, ఏఈ, జలవనరుల శాఖ

తుది దశకు ఇంజినీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ

కానూరు, తాడిగడప, న్యూస్‌టుడే

ఉమ్మడి కృష్ణా జిల్లాలో సాంకేతిక విద్యా శాఖ కౌన్సెలింగ్ అనంతరం 2024 సంవత్సరానికి సీట్ల కేటాయింపు ప్రక్రియ సెప్టెంబరు చివరికి పూర్తయ్యింది. జులై నుంచి సుదీర్ఘ కౌన్సెలింగ్(మొత్తం మూడు జరిగాయి). అనంతరం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతోంది. ఈ నేపథ్యంలో పలువురు విద్యార్థులు ఇప్పటికే ప్రవేశాలు పొందారు. కన్వీనర్ కోటాలో 78.2శాతం, మేనేజ్‌మెంట్ కోటాలో 82 శాతం సీట్లు నిండాయి.

పెరిగిన ఫీజులు : జిల్లాలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాగా గతంలో కనిష్ఠంగా రూ.35,000, గరిష్ఠంగా రూ.70,000 ఉండేది. ఈ సంవత్సరం ఫీజులు కనిష్ఠంగా రూ.40వేలు, గరిష్ఠంగా రూ.1,05,000 పెంచారు. అలానే మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు డిమాండ్‌ను బట్టి ఏటా రూ.లక్ష నుంచి 2 లక్షలు వరకు ఫీజును నిర్ణయించారు.



ఇంజినీరింగ్ కళాశాలలు	– 28
విశ్వవిద్యాలయాలు	– 2
కన్వీనర్ కోటా సీట్లు	– 14,670
పూర్తయినవి	– 11,481 (78.2%)
మిగిలినవి(కన్వీనర్ కోటా)	– 3,189
మేనేజ్‌మెంట్ కోటా సీట్లు	– 6,330
పూర్తయినవి	– 5,190 (82%)

బ్రాంచీల వారీగా నిండిన సీట్ల శాతం

బ్రాంచి	శాతం
సీఎస్ఈ, అనుబంధంగా ఉన్నవి	95
ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ	98
ఈసీఈ	84
ఈఈఈ	72
సివిల్	59
మెకానికల్	49

ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొత్తం సీట్లు (కన్వీనర్, మేనేజ్‌మెంటు కలిపి)- 21,000

వాటర్ స్పోర్ట్స్ అధికారుల పర్యటన

నాగాయలంక, న్యూస్‌టుడే: వచ్చే సంక్రాంతికి నిర్వహించే సంప్రదాయ పడవల పోటీల నిర్వహణకు స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆహ్వానం మేరకు బుధవారం నాగాయలంకలోని కృష్ణానది తీర ప్రాంతాన్ని వాటర్ స్పోర్ట్స్ అధికారులు పరిశీలించారు. పరిశీలించిన వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కెనొయింగ్, కాయకింగ్ అసోసియేషన్ ట్రెజరర్ శివారెడ్డి బృందం, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు ఉన్నారు.

వంగవీటి రాధాకు సీఎం పరామర్శ

గవర్నర్‌పేట : మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణను సీఎం చంద్రబాబునాయుడు ఫోన్‌లో పరామర్శించారు. ఇటీవల స్వల్పంగా గుండెపోటుకు గురైన రాధా.. చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేశారు. బుధవారం సీఎం చంద్రబాబు ఆయనికి ఫోన్ చేసి.. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కళాకృతుల తయారీకి ప్రభుత్వ సహకారం

వ్యర్థాలతో 800 కళాకృతులు రూపొందించిన విద్యార్థులు

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే : వ్యర్థాలతో అద్భుతమైన కళాకృతులు రూపొందించడం అభినందనీయమని, కళాకృతుల తయారీకి ప్రభుత్వపరంగా సహకారం అందిస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం నోబుల్ కళాశాలలో వ్యర్థాలతో రూపొందించిన 800 కళాకృతులను మంత్రి కలెక్టర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో అనుకున్నది సాధించవచ్చన్నారు. గతంలో తాము యువ కెరటాలు పేరుతో యువజనోత్సవాలు నిర్వహించామని, తద్వారా దేశంలో ఎక్కడికైనా వెళ్లగలమనే ధైర్యం యువతలో వచ్చిందన్నారు. భవిష్యత్‌లో బీచ్ ఫెస్టివల్ నిర్వహించి ఇటువంటి వ్యర్థాలతో కళా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ మాట్లాడుతూ పోటీలో ఎంపిక కాకపోతే ఓడినట్లు కాదన్నారు. కొన్ని కళాకృతులను గమనిస్తే వాటిని ఆన్‌లైన్‌లో పోస్టు చేస్తే మార్కెట్‌లో మంచి డిమాండ్ వచ్చే అవకాశం ఉందన్నారు. మొదటి బహుమతి మచిలీపట్నం లేడీయాంప్తిల్, అవనిగడ్డ ప్రాథమిక పాఠశాలలకు చెందిన విద్యార్థులు షేక్ ఆబీద, శాకం మహేష్‌లకు దక్కింది. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారిణి తాహెరా సుల్తానా, ప్రిన్సిపల్ ఎర్నెస్ట్, సర్వశిక్ష ఏపీసీ శ్రీరాములు నాయక్, ఏడీ మనోహర్‌నాయక్, డిప్యూటీ ఈవో పద్మారాణి, సైన్స్ అధికారి జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభ చూపిన విద్యార్థికి బహుమతి అందిస్తున్న మంత్రి రవీంద్ర

ప్రణాళికాబద్ధంగా జిల్లా అభివృద్ధి

పెనమలూరు, న్యూస్‌టుడే : ప్రజలు ఆశించిన రీతిలో బందరు పార్లమెంటులోని నియోజకవర్గాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. పెనమలూరు నియోజకవర్గ ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తల సమావేశం బుధవారం పోరంకిలోని స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగింది. దీనికి ఎంపీ బాలశౌరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా అభివృద్ధికి సాధ్యమైనంతగా కేంద్రం నుంచి నిధులు తేవడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. నాలుగేళ్ల నుంచి ప్రయత్నిస్తున్న మచిలీపట్నం- రేపల్లె రైల్వే లైను ఏర్పాటులో వారం క్రితం కదలిక వచ్చిందని, దీని ఏర్పాటుకు సర్వేను త్వరలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గం తెదేపా అభ్యర్థిగా ఎంపికైన ఆలపాటి రాజాను గెలిపించడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల తాడిగడప మున్సిపాలిటీ రూ.15 కోట్ల నిధులను నష్టపోవాల్సి వచ్చిందన్నారు. త్వరలో ఎన్నికలు నిర్వహించడానికి అడ్డంకులు తొలగిపోనున్నాయన్నారు.


ప్రసంగిస్తున్న ఎంపీ బాలశౌరి, పక్కన ఎమ్మెల్యే బోడేప్రసాద్

నేటి నుంచి కొండలమ్మ ఆలయంలో దేవీశరన్నవరాత్రులు

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: ప్రసిద్ధ వేమవరం కొండలమ్మతల్లి దేవస్థానంలో గురువారం నుంచి 12వ తేదీ వరకూ నిర్వహించనున్న దేవీశరన్నవరాత్రులకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యుత్తు దీపాలంకరణలు, ఆలయం ఎదుట భారీ ఇనుప పందిరి నిర్మాణం, చాందినీ అలంకరణలతో ముస్తాబు చేశారు. తొలిరోజు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పూజలు నిర్వహించనున్నారు.


ఆలయం ఎదుట నిర్మించిన భారీ పందిరి


అలంకరించిన ముఖమండపాలయం

ప్రత్యామ్నాయ పాఠశాలల ఏర్పాటుకు చర్యలు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లాలో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ పాఠశాలల(సీజనల్ వసతి గృహాలు) ఏర్పాటుకు రంగం సిద్ధం అవుతోంది. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా, రొయ్యల చెరువులపై పని చేయడానికి, ఇతర పనుల కోసం వేరే ప్రాంతాలకు వలసలు వెళ్లే సందర్భంలో పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడకుండా సీజనల్ వసతి గృహాలు ఏర్పాటు చేస్తారు. వీటిని ఏర్పాటు చేయక పోతే చిన్నారులను తమతో పాటు తల్లిదండ్రులు పనులు చేసే ప్రదేశాలకు తీసుకెళ్తారు. పిల్లల చదువులు నిలిచే ప్రమాదం ఉంది. జిల్లాలో కోడూరు, కృత్తివెన్ను, పెడన, నందివాడ, గన్నవరం, పమిడిముక్కల మండలాల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 30 కేంద్రాలు అసరమవుతాయని ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. అవసరం ఉన్న చోట్ల ఒక్కో పాఠశాల పరిధిలో 35 నుంచి 50 మంది విద్యార్థులు ఉన్న చోట్ల ఒక యూనిట్‌ను మంజూరు చేస్తారు. ఇక్కడ విద్యార్థులకు ఉదయం టిఫిన్, రెండు పూటల భోజనం, సాయంత్రం స్నాక్స్ ఇచ్చి రాత్రి 7.30 గంటల వరకు పాఠశాలలోనే ఉంచి చదివించి ఇళ్లకు పంపుతారు. ఒక్కో కేంద్రంలో బోధకుడు, పర్యవేక్షకుడిని నియమిస్తారు. పాఠశాల మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీకి వంట బాధ్యతలు అప్పగిస్తారు. జిల్లాలో 25 మండలాల్లో చాలా చోట్ల ఈ వసతి గృహాలు అవసరం ఉన్నప్పటికీ అక్కడి ఎంఈఓలు, సీఆర్పీలు, ప్రధానోపాధ్యాయులు చొరవ చూపని కారణంగా లక్ష్యం నీరుగారి పోతోంది. గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో జిల్లాలో 21 కేంద్రాలను నడిపారు. ఈ విషయాలపై జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్త వడుగు రామకృష్ణ మాట్లాడుతూ ఇప్పటికే మొదటి దశ ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈ నెలలో కొన్ని చోట్ల సీజనల్ వసతి గృహాలు ప్రారంభిస్తామని తెలిపారు.

రోడ్లపై బారికేడ్లులేవు.. దుకాణాల మూతలేదు!

గతంలో జగన్ మచిలీపట్నం వచ్చినపుడు దుకాణాలు మూసివేయించారు. రోడ్డు పొడవునా రెండు వైపులా బారికేడ్లు, ఇనుప కంచెలు వేసి తెరలు కట్టారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బారికేడ్లు, కంచెలు, తెరలు కనుమరుగయ్యాయి. ఇవేమీ లేకుండా సీఎం కాన్వాయ్ రోడ్డుపై వెళ్తుంటే జనాలు చంద్రబాబును చూస్తూ అభివాదం చేశారు. మచిలీపట్నంలో సీఎం పర్యటన సందర్భంగా బుధవారం కనిపించిన దృశ్యాలివి.

- ఈనాడు, అమరావతి



రహదారిలో ఇనుప కంచెలు, ముసుగు తెరలు లేకుండా..


మచిలీపట్నంలో సీఎం కాన్వాయ్


ప్రజలకు అడ్డంగా బారికేడ్లు పెట్టకుండా..

ప్రపంచానికి గాంధీజీ సిద్ధాంతాలే శరణ్యం

చల్లపల్లి, న్యూస్‌టుడే: అణుయుద్ధం అంచుల్లో ఉన్న ప్రస్తుత ప్రపంచానికి మహాత్మాగాంధీ చెప్పిన శాంతి, అహింసలే సరైన మార్గం చూపుతాయని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం గాంధీజీ జయంతిని పురస్కరించుకుని చల్లపల్లి స్మృతివనంలో మహాత్ముని విగ్రహానికి బుద్ధప్రసాద్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయోద్యమ సమయంలో గాంధీజీ రెండుసార్లు చల్లపల్లి వచ్చి ప్రసంగించడం ఇక్కడ ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. అనేక దేశాలు గాంధీజీ మార్గంలో పోరాడి విముక్తి పొందాయని చెప్పారు. తొలుత నారాయణరావునగర్‌లో తమ్మన ప్రసాద్ ఆధ్వర్యంలో మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచి పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, విజయా అకాడమీ ప్రిన్సిపల్ నాగళ్ల భీమారావు తదితరులు పాల్గొన్నారు.


మహాత్ముడి విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు

మరోసారి మల్లవల్లి భూముల సర్వే

రైతుల అభ్యంతరాలు బేఖాతరు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : బాపులపాడు మండలం మల్లవల్లిలో ఆర్.ఎస్.నంబరు 5లో ఉన్న భూముల సర్వేకు అధికారులు మరోసారి కార్యాచరణ చేపట్టారు. ఈ సర్వే నంబరులో విస్తీర్ణంపై గందరగోళం నెలకొనడం, వాస్తవ హక్కుదారులకు దస్తావేజుల ప్రకారం క్షేత్రస్థాయిలో భూమి కన్పించక పోవడంతో వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రైతులంతా మూడు నెలల కిందటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఏడాది జులై చివరి వారంలో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్లు, మండల, గ్రామ సర్వేయర్లుతో కూడిన తొమ్మిది మంది బృందం అన్నదాతల వద్ద ఉన్న దస్తావేజులు, పాసు పుస్తకాల ప్రకారం సర్వే చేపట్టారు. రెవెన్యూ అధికారులు మొత్తం విస్తీర్ణం 184 ఎకరాలుగా పేర్కొంటుండగా, రైతులు 320 ఎకరాల వరకు భూమి ఉండాలని, ఆర్.ఎస్ నంబరు 11లో పారిశ్రామికవాడ కేటాయించిన 1,360 ఎకరాల్లో తమ పొలం ఉందని చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కొందరు రెవెన్యూ అధికారులు రికార్డులు మార్చేసి, సాగులో లేని రైతుల పేర్లు నమోదు చేశారనే ఆరోపణలు కూడా చేశారు. మరోవైపు ఏపీఐఐసీ ఉన్నతాధికారులు పారిశ్రామికవాడకు సంబంధించి సరిహద్దులు తేల్చాలని ఎప్పట్నుంచో కోరుతున్నారు. ఇటీవలే వివాదం లేని వైపు సరిహద్దులు నిర్ణయించారు. ఆర్.ఎస్.నంబరు 5లో భూములు, పారిశ్రామికవాడ కూడా పక్కపక్కనే ఉండటంతో హద్దులు తేల్చడం అనివార్యమైంది. దీంతో జిల్లా సర్వే అధికారి మనీషా త్రిపాఠి ఆదేశాల మేరకు గురువారం ప్రత్యేక సర్వేకు కార్యాచరణ చేపట్టారు. ఓ పక్క రైతులు తాము లేవనెత్తిన అభ్యంతరాలకు సమాధానం, తగిన పరిష్కారం చూపాలని, అప్పుడే సర్వేకు సహకరిస్తామని చెప్పినా కూడా పట్టించుకోకుండా సర్వేకు రంగం సిద్ధం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చీపుళ్లు పట్టి.. శుభ్రం చేసినట్లు నటించి..

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం వైకాపా ప్రజాప్రతినిధులు మహానటనకు తెరలేపారు. అవనిగడ్డ మండల పరిషత్తు రహదారిని చీపుళ్లు పట్టి శుభ్రం చేసినట్లు నటించి ఫొటోలకు ఫోజులిచ్చారు. ఫొటోలు తీయడం పూర్తైన వెంటనే సర్పంచి ఉమ, ఎంపీపీ తుంగల సుమతీదేవి, మరి కొందరు చీపుళ్లు పక్కన పడేసి ఎవరి దారిన వారు వెళ్లిపోయారు.



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల విజేత కృష్ణా

ద్వితీయ స్థానంలో నిలిచిన తూర్పుగోదావరి జట్టు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో కొత్తమ్మతల్లి జాతర మహోత్సవాల నేపథ్యంలో 3 రోజులుగా జరుగుతున్న పురుషుల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు బుధవారం రాత్రితో ముగిశాయి. మొత్తం 35 జట్లు పోటీల్లో పాల్గొనగా, నాకౌట్ దశకు ఎనిమిది చేరుకున్నాయి. ఫైనల్స్‌లో కృష్ణా, తూర్పుగోదావరి తలపడగా కృష్ణా 17 పాయింట్ల ఆధిక్యంతో విజయం సాధించింది. విజేతలకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు బహుమతులు అందచేశారు. ఉత్తమ రైడర్‌గా చెంగళరావు (శ్రీకాకుళం), ఉత్తమ డిఫెండర్‌గా సాయి (తూర్పుగోదావరి), ఆల్‌రౌండర్‌గా శ్రీకాంత్ (కృష్ణా) జ్ఞాపికలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణారావు, సాధు శ్రీను, నిర్వహణ కార్యదర్శి తిరుపతిరావు, తెదేపా నాయకుడు బోయిన రమేష్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒకి రూ.లలో)

వెంకాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228. **అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 143 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 585 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

ఎంబీఏ, ఎంసీఏ స్పాట్ అడ్మిషన్లకు అవకాశం

కృష్ణావిశ్వవిద్యాలయం(మచిలీపట్నం), న్యూస్‌టుడే : కృష్ణా విశ్వవిద్యాలయ పరిధిలో ఖాళీగా ఉన్న ఎంబీఏ, ఎంసీఏ సీట్లు భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఎల్.సుశీల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదీన విశ్వవిద్యాలయంలో ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నామన్నారు. ఆ రోజ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటలలోను రిపోర్టుచేసిన వారికి అడ్మిషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఏపీఐసీఈటీ-2024 ర్యాంక్‌కార్డుతోపాటు ఓరిజనల్ ధ్రువపత్రాలు, రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలు సమర్పించడంతో పాటు రూ.1000 రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రైవేట్‌గా రోడ్డు వేస్తే.. పంచాయతీలో బిల్లు

ముస్తాబాదలో నకిలీ బిల్లులు కలకలం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : సొంత నిధులతో వేసిన రోడ్డును..పంచాయతీ ఆధ్వర్యంలో వేసినట్లు బిల్లు పెట్టుకున్న సంఘటన ఇది. ముస్తాబాద పంచాయతీ పరిధిలోని వెదురుపావులూరుకు చెందిన బేతపూడి శ్రీనివాసరావుతోపాటు పక్కన నివాసితులు తమ గృహాల ముందు 200 అడుగులు మేర సొంత స్థలాన్ని రోడ్డుకు వదిలేయగా.. శ్రీనివాసరావు ఇటీవల తన సొంత నిధులతో సీసీ రోడ్డు వేసి, దాన్ని పంచాయతీకి అప్పగించారు. ఈ క్రమంలో ఆ రహదారిని తామే వేసినట్లు పంచాయతీలో ఈవో, సర్పంచులు రూ.5 లక్షల బిల్లు పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై ఎమ్మెల్యే కార్యాలయంలో కొందరు ఫిర్యాదు చేయగా.. పంచాయతీలో జరిగిన అవకతవలపై దృష్టి సారించి పెట్టిన నకిలీ బిల్లులు ఎన్ని ఉన్నాయో తేల్చాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెదేపా వర్గాలు తెలిపాయి. గ్రామంలో బుధవారం నకిలీ బిల్లుల వ్యవహారం చర్చనీయాంశంకాగా సర్పంచి కుమారుడు విజయ్ ప్రతిదానిలో కీలకంగా వ్యవహరించినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

మహిళలపై దాడిని సహించేది లేదు..మహిళలపై దాడులను సహించేది లేదని గన్నవరం పోలీసులు తెలిపారు. ముస్తాబాదలో సర్పంచి బంధువులు మహిళపై దాడి ఫిర్యాదు విషయం తమ దృష్టికి రాలేదని.. ఆ రోజు విధుల్లో ఉన్న నూతన ఏఎస్సై ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లక పోవడంతో ఆలస్యం అయ్యిందని తెలిపారు. సత్వరమే బాధితురాలితో మాట్లాడి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామన్నారు.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

ఏజే కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

సీఎంకు ఏజే విద్యాపరిషత్ పరిరక్షణ సమితి వినతి

మచిలీపట్నం(కోనేరుసెంటరు), న్యూస్‌టుడే : చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఆంధ్రా జాతీయ(ఏజే) కళాశాల, దాని అనుబంధ సంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఏజే విద్యాపరిషత్ పరిరక్షణ సమితి నాయకులు సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చారు. మచిలీపట్నం పర్యటనలో భాగంగా బుధవారం ఏజే కళాశాలకు వచ్చిన సీఎంకు కళాశాల పరిస్థితిని పరిరక్షణ సమితి నాయకులు కొడాలి శర్మ వివరించారు. స్వాతంత్రోద్యమ సమయంలో ఈ కళాశాల జాతీయ ఉద్యమాలకు వేదికగా నిలిచిందన్నారు. కళాశాలకు ఉన్న రమారమి 300 ఎకరాల భూమి క్రమేపీ అన్యాక్రాంతం అయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. కళాశాలను ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని పూర్వ వైభవం తీసుకువచ్చే దిశగా కృషి చేయాలని పరిరక్షణ సమితి సభ్యులు బీవీఎస్ రాజబాబు, రావి వెంకట్రావు, సీహెచ్ రాజేష్ తదితరులు విజ్ఞప్తి చేశారు. అనంతరం తితిదే కల్యాణ మండపంలో నిర్వహించిన సభలో చంద్రబాబు కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పరిరక్షిస్తుందని ప్రకటించడం పట్ల ఏజే విద్యాపరిషత్ పరిరక్షణ సమితి హర్షం ప్రకటించింది.



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఏజే విద్యా పరిషత్ పరిరక్షణ సమితి నాయకులు



చంద్రబాబుకు వినతిపత్రం సమర్పిస్తున్న సత్యనారాయణ

బాలాజీరావు ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆంధ్ర జాతీయ కళాశాలలో హెలిప్యాడ్ వద్ద సీఎంను ఆయన కలిశారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

భాజపాకు సముచిత స్థానం కల్పించండి

భాస్కరపురం(మచిలీపట్నం): నామినేటెడ్ పోస్టుల భర్తీలో భాజపాకు సముచిత స్థానం కల్పించాలని పార్టీ మచిలీపట్నం ఇన్‌ఛార్జి సోడిశెట్టి



చంద్రబాబును కలసిన సోడిశెట్టి బాలాజీ

డ్రెయిన్లలో పూడిక తీయించండి

భాస్కరపురం (మచిలీపట్నం): పంటకాలువలు, డ్రెయిన్లలో పూడిక తీయించి పంటలు ముంపునకు గురి కాకుండా కాపాడాలని తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. గత ప్రభుత్వం పంటకాలువలు, డ్రెయిన్లలో పూడిక తీయించని కారణంగా పంటలు ముంపునకు గురవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని ఆయన సన్మానించారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు బుధవారం ఘనస్వాగతం లభించింది. ఆంధ్రజాతీయ కళాశాలలోని హెలిప్యాడ్ వద్ద మంత్రులు కొల్లు రవీంద్ర, పొంగూరు నారాయణ, కొలుసు పార్థసారథి, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు వెనిగళ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్ రాజా, మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన కొనకళ్ల నారాయణరావు, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్‌లతోపాటు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధరరావు చంద్రబాబుకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి వెంట పాల్గొన్నారు.

సేతువులు.. ప్రమాద హేతువులు

శిథిలావస్థకు చేరిన వంతెనలతో ప్రజల ఆందోళన



తరకటూరులో శిథిలావస్థకు చేరిన వంతెన

గూడూరు, న్యూస్‌టుడే

మండలంలోని వివిధ ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన వంతెనలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొన్ని చోట్ల రక్షణ గోడలు లేకపోవడం, రెయిలింగ్ దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు గతంలో వైకాపా పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రతిపాదనలు చేయిస్తామని చెప్పడమే కానీ ఒక్క రూపాయి మంజూరు చేయలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు చేసి.. పట్టించుకోకుండా వదిలేసి: మండలంలోని తరకటూరు వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. బ్రిటిష్ కాలంలో ఏర్పాటు చేసిన ఇనుపరాడ్లు తుప్పు పట్టి విరిగిపోయాయి. దీంతోపాటు వంతెన వద్ద రహదారి కోతకు గురైంది. గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగించే వంతెన ప్రమాదకరంగా మారడంతో కొత్త వంతెన నిర్మించాలని కోరుతూ గ్రామస్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు మాజీ మంత్రి జోగి రమేష్‌తోపాటు పలువురికి వినతిపత్రాలు అందించారు. ఈ వంతెన నిర్మాణం కోసం రూ.8.60కోట్లతో ప్రతిపాదనలు చేయగా నిధులు విడుదల చేయిస్తానని చెబుతూ వచ్చి చివరకు ఆ ఊసెత్తకుండా వదిలేశారని వాపోతున్నారు. తరకటూరుతోపాటు కంచకోడూరు, మద్దిపట్ల,



ఆకుమర్రులాకుల వద్ద ప్రమాదకరంగా..



వంతెన వద్ద విరిగిపడిపోయిన రెయిలింగ్

మొవ్వ మండలంలోని పెద్దాలయుడుతోట తదితర గ్రామాలకు చెందిన ప్రయాణికులు ఈ సేతువు పై నుంచే రాకపోకలు సాగిస్తారు. అలాంటి వంతెన ప్రమాదకరంగా మారడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం: ఆకుమర్రులాకుల వంతెన ప్రమాదకరంగా మారింది. ఎప్పుడో బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెన. ఇప్పటికీ పటిష్ఠంగానే ఉన్నా రెయిలింగ్ వాల్ లేకపోవడంతో వంతెనపై నుంచి రాకపోకలు అంటేనే భయపడిపోతున్నారు. రక్షణగోడ నిర్మించాలని ప్రజలు ఏళ్లతరబడి మొరపెట్టుకుంటున్నా ఇంతవరకు ఎవరూ పట్టించుకోవడం లేదు. గూడూరు, మొవ్వ మండలంలోని వివిధ ప్రాంతాలకు ప్రతి రోజూ వేలాదిమంది రాకపోకలు సాగిస్తారు. సుమారు 500 వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. వంతెన ఎత్తులో ఉండటంతో పైన రక్షణగోడ సరిగా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతాయని ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై గతంలో పలువురు కలెక్టర్లకు అర్జీలు దాఖలు చేశారు. అయినా వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మల్లవోలులో బ్రిడ్జి కూడా కుంగిపోయింది. ఇటీవల నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సమస్యలపై ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సమీక్షించడంతో కూటమి ప్రభుత్వ హయాంలో వంతెనల సమస్య పరిష్కారం అవుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

పెడన: మహిళల ఆర్థిక స్వావలంబనకు స్వచ్ఛంద సంస్థ సహాయ ఫౌండేషన్ కృషి చేస్తుందని సంస్థ విద్యావిభాగం ఛైర్మన్ మట్టా రాధాకృష్ణమూర్తి అన్నారు. స్థానిక గుడివాడ రోడ్డులోని షాదీఖానాలో మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్‌లో నిర్వహించిన ఉచిత శిక్షణ ముగింపు సందర్భంగా ధ్రువీకరణపత్రాలు అందజేశారు. రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఎనిమిది పర్యాయాలు ఈ తరహా శిక్షణ ఇచ్చామని అధిక శాతం మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. సంస్థ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, ఉపాధ్యక్షుడు మామిడి ప్రసాద్, కోన వెంకటేశ్వరమ్మ, అల్లాడ శ్యామల, చలమలశెట్టి హేమలత తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పొందిన మహిళలతో ఫౌండేషన్ ప్రతినిధులు

మహాసభలను విజయవంతం చేయాలి

మచిలీపట్నంకార్పొరేషన్: విజయనగరంలో నిర్వహించే ఏపీటీఎఫ్ 20వ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర కార్యదర్శి తమ్ము నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని సంఘ కార్యాలయంలో మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లంకేష్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జి.సత్యనారాయణ, నాయకులు టి.దస్తగిరి, కె శ్రీనివాసరావు, వి.శివరామకృష్ణ, బి.వెంకయ్య, జి.రామలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో జరిగే ఈ సభల్లో విద్యారంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై మహాసభల్లో చర్చించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సాయాన్ని సద్వినియోగం చేసుకోండి

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : విద్యార్థి సహాయ సంస్థ సేవలు ప్రశంసనీయని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఆర్కే విద్యాసంస్థల అధినేత బండి రామకృష్ణ అన్నారు. బుధవారం నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో సంస్థ ఆధ్వర్యంలో వితరణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ తరగతులు చదువుతున్న 34 మంది విద్యార్థులకు రూ.1.32లక్షలు సాయంగా అందించారు. సాయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. సంస్థ అధ్యక్షులు రామ్‌దేవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పూర్వ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గాజుల వెంకట తాతారావు, సంస్థ కార్యదర్శి అనుముకొండ వెంకటేశ్వరరావు, కోశాధికారి అప్పినేడి పోతురాజు తదితరులు ప్రసంగించారు. శ్రీకృష్ణా ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.30వేల విలువైన దుస్తులు విద్యార్థులకు అందజేశారు. యూటీఎఫ్ నాయకులు కేఏ ఉమామహేశ్వరరావుతోపాటు వివిధ సంస్థల ప్రతినిధులు లంకా రాజేష్, కారుమూరి రాజేంద్రప్రసాద్, అంబటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులకు సాయం అందిస్తున్న బండి రామకృష్ణ

దసరా ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు



బంటుమిల్లిలో దసరా ఉత్సవాలకు ముస్తాబు అయిన కనకదుర్గమ్మ వారి ఆలయం

బంటుమిల్లి,న్యూస్‌టుడే : పెడన, మచిలీపట్నం నియోజకవర్గాల్లో గురువారం నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయాలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. చలువ పందిర్లు, మామిడి తోరణాళతో సుందరంగా ముస్తాబు చేశారు. బంటుమిల్లిలోని శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయం, మల్లేశ్వరం కోదండ రామాలయాలం, నాగేశ్వరరావుపేట పంచాయతీ లక్ష్మీనారాయణపురంలో అమ్మవారు తొలి రోజు శ్రీ బాల త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. స్థానిక సీతా రామస్వామి, వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానాలలో ఆదిలక్ష్మిగా, పెదతుమ్మిడి శ్రీ పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు రజిత కవచాలంకృత పార్వతీదేవిగా అలంకరించనున్నారు.


పెదలంక డ్రెయిన్‌లో విద్యార్థి గల్లంతు

కృత్తివెన్ను, న్యూస్‌టుడే : మండలంలోని పెదలంక డ్రెయిన్‌లో పడి విద్యార్థి గల్లంతైన ఘటన బుధవారం చోటు చేసుకొంది. ఎస్సై, స్థానికుల వివరాల మేరకు మండలంలోని గరిశపూడికి చెందిన దాసరి భరత్(17) తల్లిదండ్రులతో కలిసి బీమవరంలో ఉంటూ ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులు కావడంతో తండ్రి వెంకటేశ్వర్లుతో కలిసి తాతయ్య నాన్నమ్మలను కలవడానికి సొంత గ్రామం అయిన గరిశపూడి వచ్చి బుధవారం ఓ శుభకార్యంలో పాల్గొన్నాడు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల సమయంలో అండర్ టన్నెల్ సమీపంలోకి వెళ్లగా పెదలంక డ్రెయిన్‌లో కాలు జారి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్సై పైడి బాబు, ఫైర్, రెవెన్యూ సిబ్బంది జాలరులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. అప్పటి వరకు బంధువులు, కుటుంబ సభ్యులతో గడిపిన బాలుడు గల్లంతవ్వడంతో వారు శోక సముద్రంలో మునిగారు.



గల్లంతైన దాసరి భరత్

చెన్నూరు ప్రజారోగ్య కార్మికులకు బీమా



కార్మికుడికి పొగ యంత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

పెడన, న్యూస్‌టుడే : చెన్నూరు పంచాయతీలో పనిచేస్తున్న 5గురు ప్రజారోగ్య కార్మికులకు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం కింద బీమా ధ్రువీకరణపత్రాలను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అందజేశారు. తోటమూలలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఈ సర్టిఫికెట్లతో పాటు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సరఫరా చేసిన ఫాగింగ్ మిషన్‌ను ఎమ్మెల్యే కార్మికుడికి అందజేశారు. ఈ బీమా పొందిన కార్మికులు ప్రమాదవశాత్తూ మృతి చెందితే రూ.12లక్షలు, సాధారణ మృతికి రూ.2లక్షలు చెల్లిస్తారని పంచాయతీ కార్యదర్శి మీరా చెప్పారు. తెదేపా మండల అధ్యక్షుడు శలపాటి ప్రసాద్, సర్పంచి వేములచంటి, కూటమి నేతలు యర్రంశెట్టి దేవేంద్రప్రసాద్, పంద్రాజు లక్ష్మణరావు, పంద్రాజు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



న్యాయసేవాసదన్ వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న న్యాయమూర్తులు చిన్నంశెట్టి రాజు, కేవీఆర్ కృష్ణయ్య



భాస్కరపురంలో గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎల్ఐసీ ఉద్యోగ సంఘ నాయకులు



బంటుమిల్లిలో గాంధీజీ విగ్రహానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ నివాళి

మహాత్ముని మార్గం అనుసరణీయం



స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ బ్యాంకు ఉద్యోగులు

న్యూస్‌టుడే బృందం: మహాత్ముని మార్గం అనుసరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని వివిధ పక్షాల ఆధ్వర్యంలో గాంధీజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కోర్టులోని న్యాయసేవాసదన్ వద్ద న్యాయమూర్తులు చిన్నంశెట్టి రాజు, కేవీఆర్ కృష్ణయ్య తదితరులు పాల్గొని స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అహింసా మార్గంలో మంచి పరివర్తనతో మెలగాలన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు గొల్లు కృష్ణ, అబ్దుల్‌మతీన్ తదితరులు గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మతోన్మాదరాజకీయాల నుంచి దేశాన్ని కాపాడాలంటూ భాస్కరపురంలో గాంధీవిగ్రహానికి వినతిపత్రం అందజేశారు. వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. లక్ష్మీనృసింహ సోమయాజీ సమాజం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు.



బంటుమిల్లి కొమ్మారెడ్డి హైస్కూల్‌లో..



జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో..



పెడన గ్రామీణం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో



గున్నయ్యశెట్టిని సత్కరిస్తున్న లక్ష్మీనృసింహ సోమయాజి సమాజ సభ్యులు



పెడన: మున్సిపల్ కార్యాలయంలో మహాత్ముడికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు



లేడియాంప్తిల్ కళాశాలలో..



పెడన: చెన్నూరులో అంగన్‌వాడీ చిన్నారుల సమరయోధుల వేషధారణ



వాసవీ అనుబంధ క్లబ్‌ల ఆధ్వర్యంలో..



మచిలీపట్నం రూరల్ : చిట్టిపాలెంలో గాంధీకి నివాళులర్పిస్తున్న రత్తయ్య, తదితరులు

యథేచ్ఛగా మాంసం విక్రయాలు

పెడన, న్యూస్‌టుడే : మహాత్ముడి జయంతి రోజున జీవహింస చేయకూడదన్న నిబంధన ఉన్నా పెడన పట్టణంలో అమలు కాలేదు. మత్స్య మార్కెట్‌లో చేపల విక్రయాలు ఎప్పటిలాగే కొనసాగాయి. కొన్ని బిర్యానీ కేంద్రాలు తెరిచి ఉండటం కన్పించింది. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపంతోనే జాతిపిత జయంతి రోజు విక్రయాలు సాగాయని ప్రజలు నిరసిస్తున్నారు. కొన్ని చోట్ల మాంసం విక్రయాలు కూడా సాగాయి.



మార్కెట్ సమీపంలో చేపలు విక్రయిస్తూ..

జనసేన ఆధ్వర్యంలో నగర సంకీర్తన

గొడుగుపేట, న్యూస్‌టుడే : సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా జనసేన ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నగర సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వాహనంపై దేవతామూర్తుల ప్రతిమలను ఉంచి రామనామ స్మరణ చేసి పురవీధులలో సంకీర్తన చేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, నాయకులు కొట్టె వెంకట్రావు, గడ్డం రాజు తదితరులతో పాటు భాజపా రాష్ట్ర నాయకుడు పంతం గజేంద్ర పాల్గొన్నారు. పలువురు కళాకారులు దేవతామూర్తుల వేషధారణలో ఆకట్టుకున్నారు.



రథంపై కొలువైన దేవతామూర్తులు



సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

పరిసరాల శుభ్రతతో మానసిక స్వచ్ఛత

మంగినపూడి (మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే : పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే మానసికంగా స్వచ్ఛత పొందుతామని భారత్ ఎలక్ట్రానిక్స్ జనరల్ మేనేజర్ జితేంద్రసింగ్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛసాగర్.. సుందర్‌సాగర్ నినాదంతో క్లీన్ ఆఫ్ బీచెస్‌లో భాగంగా బుధవారం మంగినపూడి బీచ్‌ను శుభ్రం చేశారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి సుంకర రాము, జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఫణిధూర్జటి, అధికారులు బి.వినోద్‌కుమార్, సుబ్బారావు, రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ టి.బాలాజీ, ధనేకుల కళాశాల ప్రిన్సిపల్ కె.రవి, విద్యార్థులు పాల్గొన్నారు.



సేకరించిన చెత్తతో విద్యార్థులు, బెల్ జీఎం

పెనమలూరు
• పెనమలూరు • గన్నవరం

మానవతా దృక్పథంతో సేవ చేయండి

ఉయ్యూరు, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంత ప్రజానీకానికి మానవతా దృక్పథంతో అధునాతన వైద్యసేవలందించాల్సిన అవసరం ఉందని మంత్రి పార్థసారథి అభిప్రాయపడ్డారు. ఉయ్యూరులోని కాటూరు రోడ్డులో ఏర్పాటు చేసిన హోప్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను ఆయన బుధవారం ప్రారంభించారు. అంతర్జాతీయ సువార్త సందేశకులు బ్రదర్ అనిల్‌కుమార్, హోప్ అధినేత డాక్టర్ జాన్ డేవిడ్, ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వైద్యశాలను ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారథి, బ్రదర్ అనిల్‌కుమార్

విష ప్రచారం తిప్పి కొట్టాలి

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ కచ్చితమైన సమాచారం చేరవేసేలా సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. ప్రభుత్వంపై జరిగే విష ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని కోరారు. మన టీడీపీ యాప్ వినియోగంలో మండలంలో అగ్రగాములుగా నిలిచిన బాపులపాడు తెదేపా గ్రామ బాధ్యులు అట్లూరి శ్రీను, గార్లపాటి రాజేశ్వరరావు, నాయకులు పొట్లూరి ఫణికుమార్, మాదల శ్రీధర్‌లను ఎమ్మెల్యే అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు.


శ్రీనుకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

వరద బాధితులకు చేయూత

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : ఇటీవల వచ్చిన వరదల కారణంగా హనుమాన్ జంక్షన్, రామన్నగూడెం, రంగయ్యప్పారావుపేటలో నష్టపోయిన పలువురికి బుధవారం భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి హనుమాన్ జంక్షన్ వారి తరపున కిట్లు పంపిణీ చేశారు. సమితి మండల కన్వీనర్ బెక్కం వెంకటేశ్వరరావు, కొమరిగిరి చంద్రశేఖర్, శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామస్థులు పాల్గొన్నారు.


బాధితులకు కిట్లు అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

చెత్త పన్ను రద్దుతో హర్షాతిరేకాలు..!

ప్రజలపై రూ.32 లక్షల భారం తగ్గినట్టే

కానూరు, తాడిగడప, న్యూస్‌టుడే

గాంధీ జయంతి రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఇకపై చెత్త పన్ను వసూలు చేయకూడదని ప్రకటించడంతో తాడిగడప పురపాలక సంఘంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలు సంతోషపడుతున్నారు. ఏటా తమపై 720 రూపాయల అదనపు భారం తగ్గినట్లే అని ఆనంద వెలిబుచ్చారు. 2021 డిసెంబరు నుంచి ఇప్పటి వరకు తాడిగడప పురపాలికలోని నాలుగు సర్కిల్స్‌లో నెలకు 32 లక్షల రూపాయల చెత్త పన్ను కింద వసూలు చేశారు. ఇప్పుడు ఆ పన్ను ఉండదన్న సంకేతాలతో ప్రజలు తమపై అదనపు భారం తప్పిందనుకుంటున్నారు.

పురపాలక సంఘం పేరు	తాడిగడప
సర్కిల్స్	కానూరు, తాడిగడప, యనమలకుదురు, పోరంకి
మొత్తం జనాభా	2,00,000
మొత్తం ఇళ్లు	43,689
వ్యాపార, వాణిజ్య సంస్థలు	2,833
ఇంటింటికి వసూలు చేస్తున్నది	రూ.60
కాల్వకట్ల పక్కన వసూలు	రూ.30
వాణిజ్య సంస్థలకు	రూ.వెయ్యి నుంచి 6 వేల వరకు (ప్రాంతం అనుసరించి)
మొత్తం వసూలు లక్ష్యం	32 లక్షలు

అధికారుల ఆదేశాలతో..

పురపాలిక పరిధిలో మొత్తం 43,689 గృహాలు ఉన్నాయి. వీటిలో 33,689 ఇళ్లకు 60 రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సంవత్సరానికి సాధారణ ప్రాంతాల్లో ఉన్నవారికి రూ.720, కాల్వకట్ల మీద ఉన్నవారికి రూ.360 అదనపు భారం పడింది. ఎన్నికల ముందు అధికారుల ఆదేశాలతో మూడు నెలల నుంచి పన్నులు వసూలు జరుగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల నుంచి ఎటువంటి చెత్త పన్ను వసూలు చేయలేదు. ఇప్పుడు స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.


వ్యర్థాలు సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు



2021 డిసెంబరు నుంచి పన్ను వసూలు చేయడం మొదలు పెట్టి 2024 జనవరి వరకు వసూలు చేశారు. దాదాపుగా 25 నెలల పాటు ప్రతి కుటుంబం నుంచి నెలకు రూ.60 చొప్పున వసూలు చేశారు. ఇప్పుడు ఆ పన్ను రద్దు నిర్ణయంతో ప్రతి కుటుంబంపై ఏటా రూ.720 భారం తగ్గింది. ఈ నిర్ణయం తీసుకున్న చంద్రబాబుకు ప్రజలు ధన్యవాదాలు తెలుపుతున్నారు. **-అంగిరేకుల మురళి, కానూరు**

క్రీస్తు మార్గం అనుసరణీయం

ఉయ్యూరు, న్యూస్‌టుడే : మనిషి పాపభీతి కలిగి ఉండాలని, క్రీస్తు మార్గం అనుసరణీయమని, ఆయన సందేశం శుభపరిణామాలకు మార్గమని అంతర్జాతీయ క్రీస్తు వాక్య సందేశకులు అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక ఇమ్మానియేలు ప్రార్థనా మందిరంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన బైబిల్ వాక్య సందేశాన్ని అందించారు. పలువురు దైవజనులు, విశ్వాసులు హాజరయ్యారు.


సందేశం అందిస్తున్న బ్రదర్ అనిల్‌కుమార్

చిన్నారి వైద్యానికి సాయం



మండలంలోని వీరవల్లికు చెందిన మందారపు రమేష్‌కుమార్, రాజేశ్వరి దంపతుల కుమార్తె అంకిత పుట్టుకతోనే వెన్ను సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. దీంతో తరచుగా శస్త్రచికిత్సలు చేయడం అనివార్యమైంది. ఈ విషయం తెలుసుకున్న మానవత సంస్థ బుధవారం స్థానిక కార్యాలయంలో ఆ కుటుంబానికి రూ.50 వేలు నగదు సాయం అందించింది.

-న్యూస్‌టుడే, హనుమాన్ జంక్షన్

యువత ఆధ్యాత్మికతపై దృష్టి

ఉయ్యూరు, న్యూస్‌టుడే : యువత ఆధ్యాత్మికత వైపు దృష్టిపెట్టాలని, క్రీస్తు సందేశాలతో మంచి మార్గంలో నడవడిక సాగించాలని హెబ్రోను చర్చి క్రీస్తు సందేశకులు డాక్టర్ జాన్ డేవిడ్ అన్నారు. ఈ చర్చి ఆధ్వర్యంలో బుధవారం 'యూత్ రీట్రీట్-2024' జరిగింది. ఇందులో బైబిల్ వాక్యాలు, పాటలు, క్విజ్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. వాక్యం పోటీలో విజేత కొవ్వూరుకు చెందిన ఆర్.సునన్నాకు ముఖ్య అతిథి జీవమణి బంగారు ఉంగరం అందించారు.

నగర సంకీర్తన

గొడుగుపేట, న్యూస్‌టుడే : సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా జనసేన ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నగర సంకీర్తన నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


ముస్తాబైన కంకిపాడు శివాలయం

కంకిపాడు, న్యూస్‌టుడే : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు మండలంలోని శివాలయాలు, ఉప్పలూరులోని షిర్డిసాయి మందిరం, కంకిపాడు సమీప గాయత్రీ విహార్‌లో ఏర్పాట్లు చేశారు. కంకిపాడు శివాలయంలో గురువారం అమ్మవారిని బాలత్రిపురసుందరీదేవి రూపంలో అలంకరించనున్నట్లు నిర్వాహక ప్రతినిధులు బుధవారం తెలిపారు.


రామవరప్పాడు పేరంటాలమ్మ ఆలయం వద్ద ఇలా..

రామవరప్పాడు : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు రామవరప్పాడులోని శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం ముస్తాబైంది. గురువారం నుంచి అక్టోబరు 12 వరకు వేడుకలు నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు చేశామని ఈవో ప్రియాంక తెలిపారు.


పటమట: రాజరాజేశ్వరి గుడి

పటమట: దసరా ఉత్సవాలకు పటమట గణపతి సచ్చిదానంద ఆశ్రమంలోని శ్రీమరకత రాజరాజేశ్వరి ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు.

వైభవంగా ముందస్తు దసరా



కానూరు నారాయణ పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఇందులో పలువురు విద్యార్థినులు అమ్మవారి వివిధ వేషధారణలతో సందడి చేశారు. **-న్యూస్‌టుడే, కానూరు**

మండల స్థాయి క్రీడల్లో ప్రతిభ



కంకిపాడు గ్రామీణ: మండల స్థాయి క్రీడా పోటీల్లో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా స్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఏజీఎం మురళీకృష్ణ, ధీరేంద్ర, ప్రిన్సిపల్ శివ, శౌర్య విద్యార్థులతో పాటు వ్యాయామోపాధ్యాయులను అభినందించారు.

గ్రామీణాభివృద్ధిపై ప్రణాళికల రూపకల్పన

గన్నవరం గ్రామీణం : గ్రామీణాభివృద్ధి ప్రణాళికలపై దిల్లీలో జరిగిన జాతీయస్థాయి కార్యశాలకు మండలంలోని కేసరపల్లి సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక హాజరయ్యారు. గతనెల 30న జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్రం నుంచి ముగ్గురు సర్పంచులకు పాల్గొనే అవకాశం దక్కగా అందులో ఆమె ఒకరు. పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికల రూపకల్పన, అమలుపై కార్యశాలలో అవగాహన కల్పించారు.


ప్రసంగిస్తున్న సర్పంచి లక్ష్మీమౌనిక

పెరటి సాగుతో ప్రయోజనం

కంకిపాడు, న్యూస్‌టుడే : పెరటి కూరగాయల పెంపకంతో పలు ప్రయోజనాలున్నాయని దాత, ప్రభుత్వ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ పెండ్యాల రామారావు అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం మంతెనకు చెందిన మహిళలకు పలు కూరగాయల మొక్కలను ఆయన పంపిణీ చేశారు.

బాధ్యతల స్వీకరణ

పెనమలూరు, కంకిపాడు, న్యూస్‌టుడే : కంకిపాడు జలవనరుల శాఖ ఏఈగా పరిశె నాగబాబు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న వీరాంజనేయులు వీరంకిలాకు బదిలీపై వెళ్లారు. పంట కాల్వలు నిర్వహణ, జలవనరుల శాఖ ఆస్తుల పర్యవేక్షణలపై దృష్టి సారిస్తానని నాగబాబు తెలిపారు.


తాడిగడప: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్


ఉయ్యూరులో..


హనుమాన్ జంక్షన్‌లో...


బాపూజీ ఆశయ సాధనకు కృషి

పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో బుధవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాపూజీ విగ్రహాలు, చిత్రపటాలకు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **-న్యూస్‌టుడే, బృందం**


పోరంకిలో...


కంకిపాడు గ్రామీణం : జనసేన కార్యాలయంలో..


కంకిపాడులో...


గన్నవరంలో..


రామవరప్పాడులో...

ప్రకటన

నా క్లయింట్లు 1) శ్రీ కడియాల కోటేశ్వరరావు గారి కుమారుడు **శ్రీ కడియాల జయకృష్ణ,** (2) శ్రీ బావరాజు శ్రీకాంత్ గారి భార్య **శ్రీమతి వరలక్ష్మి రాజనాల,** నివాసం: విల్లా నెం.22, కెయమ్‌వి వివాన్, పోరంకి, పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా గార్ల వల్ల సంజాయిషీ పొంది ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా:

నా క్లయింట్లు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని కుందావారికండ్రిక విజయవాడ రూరల్ మండలం, ఎన్టీఆర్ జిల్లా కాపురస్తులు 1) చప్పిడి (లేటు) సాంబశివరావు గారి భార్య శ్రీమతి నాగేంద్రమ్మ, వీరి కుమారులు (2) చప్పిడి శ్రీనివాసరావు, (3) చప్పిడి రమేష్, చప్పిడి (లేటు) సాంబశివరావు గారి కుమార్తెలు (4) శ్రీ పిన్నిబోయిన వెంకటేశ్వరరావు గారి భార్య ఉష (5) శ్రీ అంగిరేకుల పెద్దిరాజు గారి భార్య శ్రీమతి నాగమణి (6) శ్రీ తాడిబోయిన రామకోటేశ్వరరావు గారి భార్య శ్రీమతి పుష్ప గార్ల నుండి క్రయము చేయదలచి క్రయము ఖరారు చేసుకొనియున్నారు.

కాగా దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని శ్రీ చప్పిడి సాంబశివరావు గారు వారు జీవించియున్న కాలంలో ది. 15-09-2011వ తేదీన వెదురుపావులూరు శివారు ముస్తాబాద గ్రామ కాపురస్తులు మాదు (లేటు) రాయలు గారి కుమారుడు మాదు నాగయ్య గారి వలన వెదురుపావులూరు శివారు ముస్తాబాద గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన వెదురుపావులూరు గ్రామ రీ. సర్వే నెం.207/2 **రు దాఖలా య.1.06ట్లు** శేరి మెరక భూమిని క్రయము పొంది వారి పేర గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం దస్తావేజు నెం. 7602/2011రుగా రిజిస్ట్రేషన్ చేయించుకొని సర్వ సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములతో అనుభవించుచూ, సదరాస్తిని గురించి ఎటువంటి లిఖిత పూర్వకమైన ఏర్పాట్లు చేయకుండా సదరు శ్రీ చప్పిడి సాంబశివరావు గారు ది. 20-03-2019వ తేదీన పరమపదించినారనియు, వారికి భార్య 1) శ్రీమతి నాగేంద్రమ్మ, కుమారులు (2) చప్పిడి శ్రీనివాసరావు (3) చప్పిడి రమేష్, కుమార్తెలు (4) శ్రీమతి పిన్నిబోయిన ఉష (5) శ్రీమతి అంగిరేకుల నాగమణి, (6) శ్రీమతి తాడిబోయిన పుష్ప గార్లు మాత్రమే ముఖ్య వారసులైనందున వారి మరణానంతరం ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని స్వాధీనంచేసుకొని వారి సర్వ సంపూర్ణ హక్కుభుక్తములతో జాయింటుగా అనుభవించుచున్నారనియు, సదరు ఆస్తిని శ్రీమతి చప్పిడి నాగేంద్రమ్మ వగైరాలు విక్రయించుటకు నా క్లయింట్లు **1) శ్రీ కడియాల జయకృష్ణ, 2) శ్రీమతి వరలక్ష్మి రాజనాల** గార్లతో విక్రయం ఖరారు చేసుకొని కొంత మొత్తం చెల్లించియున్నారు. కాగా, సదరాస్తికి సంబంధించిన గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం. 2436/1966రుగా గల ఒరిజినల్ లింకు దస్తావేజు గైరవీలు అయినందున ఆకివీడు పోలీసు వారు ఎంఎల్‌డి012400451746, తేదీ 20-8-2024న నాట్ ట్రేస్డ్ సర్టిఫికెట్ జారీచేసినారని తెలియజేయుచున్నారు. కాగా సదరు షెడ్యూల్ తాలూకు స్థిరాస్తిపై గాని మరియు గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 2436/1966రు గల దస్తావేజుపై గాని ఎవరికైననూ ఏ విధమైన హక్కులు గాని, చెల్లదగు క్లయిములు గాని, కోర్టు వ్యవహారములు గాని, థర్డ్ పార్టీ క్లయిములు గానీ, తనఖా వగైరాలు గాని మరి ఏ విధమైన అభ్యంతరములు గాని ఉన్నయెడల వారు ఈ ప్రకటన తేదీ లగాయతు 7 రోజుల వ్యవధి లోపుగా తగు సాక్ష్యాధార పత్రముల కాపీలతో లిఖిత పూర్వకముగా రిజిష్టరు పోస్టులో తిరుగు చీటీతో సహా యీ దిగువ చిరునామాకు తెలియజేయవలసినది. సదరు గడువు తేదీలోగా చట్ట ప్రకారము చెల్లదగు ఎటువంటి క్లయిములు గానీ, అభ్యంతరములు గాని రానియెడల షెడ్యూలు ఆస్తిని నిర్వివాద ఆస్తిగా యెంచి నా క్లయింట్లు షెడ్యూల్ ఆస్తిని క్రయము పొంది వార్ల పేర రిజిష్టర్డ్ క్రయ దస్తావేజు పొందగలరనియు ఆ దర్మిలా వచ్చు ఎట్టి అభ్యంతరములు గానీ, క్లయిములు గానీ, నా క్లయింట్లను గానీ, షెడ్యూలు ఆస్తిని గానీ చట్టపరంగా బైండు చేయజాలవనియు, నా క్లయింట్లు పొందు క్రయమును భంగము చేయజాలవనియూ ఇందుమూలముగా తెలియచేయటమైనది.

షెడ్యూలు: కృష్ణాజిల్లా గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, గన్నవరం మండలం, వెదురుపావులూరు శివారు ముస్తాబాద గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన **వెదురుపావులూరు** గ్రామం రీ. సర్వే నెం.207/2రుకు జాయింటు పట్టా విభజన దాఖలా రీ సర్వే నెం.**207/2ఎ** దాఖలా **య.1.05ట్లు** శేరి మెరక వ్యవసాయ భూమికి **హద్దులు. తూర్పు:** చెరుకూరు వెంకట్రావు గారి భూమి, **దక్షిణం:** కోగంటి రామ్మోహనరావు, కొమరవల్లి రాజా గార్ల భూమి, **పడమర:** మాదు మాణిక్యమ్మ గారి భూమి, **ఉత్తరం :** మండా రమాదేవి గారి భూమి మరియు యావత్తు యీజ్‌మెంట్ హక్కులతో సహా.

యస్. కోటిరెడ్డి, అడ్వకేట్, 59-6-31/టి2, లక్ష్మీ అపార్ట్‌మెంట్ గాయత్రినగర్, విజయవాడ - 520 008. మొబైల్ నెం: 98486 86957
విజయవాడ, తేది: 02-10-2024

ముగ్గురు ఎమ్మెల్యేల రాక

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : బాపులపాడు మండలం వేలేరులో సుమారు రూ.9 కోట్ల వ్యయంతో అధునాతన రెడిమిక్స్ ప్లాంటును ఏర్పాటు చేశారు. టెక్నో ఇన్‌ప్రా పేరుతో నిర్మించిన ఈ పరిశ్రమను గన్నవరం, దెందులూరు, చింతలపూడి ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్ గురువారం ఉదయం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు.

యువతకు పోటీతత్వం అవసరం

ఉయ్యూరు, న్యూస్‌టుడే : యువతలో ఆరోగ్యకరమైన పోటీతత్వం అలవడాలని ఇండియన్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి కె.సి.హెచ్.పున్నయ్యచౌదరి అన్నారు. స్థానిక విశ్వశాంతి పాఠశాలలో బుధవారం ప్రతిష్ఠాత్మక సీబీఎస్‌ఈ క్లస్టర్ సెవెన్ బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఇందులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ పోటీలకు తెలుగు రాష్ట్రాల నుంచి 180 టీములు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా మారుతీరావు వర్ధంతి

ఉయ్యూరు, న్యూస్‌టుడే : కేసీపీ అధినేత వెలగపూడి మారుతీరావు వర్ధంతిని బుధవారం కేసీపీ ఆవరణలో నిర్వహించారు. మారుతీరావు విగ్రహానికి యూనిట్ హెడ్ వై.సీతారామదాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.


వెలగపూడి విగ్రహానికి పూలమాల వేస్తున్న కేసీపీ యూనిట్ హెడ్ సీతారామదాస్

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు బుధవారం ఘనస్వాగతం లభించింది. ఆంధ్రజాతీయ కళాశాలలోని హెలిప్యాడ్ వద్ద మంత్రులు కొల్లు రవీంద్ర, పొంగూరు నారాయణ, కొలుసు పార్థసారథి, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు వెనిగళ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్ రాజా, మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన కొనకళ్ల నారాయణరావు, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్‌లతో పాటు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, జిల్లా కలెక్టర్ డీకె బాలాజీ, ఎస్పీ గంగాధరరావులు చంద్రబాబుకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి వెంట పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

పెనమలూరు, న్యూస్‌టుడే : విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. కుందేటి రమాదేవి(42) కంకిపాడు మండలం చలివేంద్రపాలెం నివాసి. ఆమె రెండేళ్ల నుంచి గంగూరులోని బిగ్ బాస్కెట్ గోదాంలో స్వీపరుగా పని చేస్తోంది. ఈ నెల ఒకటో తేదీన విధులకు వెళ్లి ప్లాస్టిక్ బాక్సులను విద్యుత్తు వాటర్ గన్‌తో శుభ్రం చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయింది. దీంతో గోదాం నిర్వాహకులు ఆమెను సమీపంలోని క్యాపిటల్ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా కొద్దిసేపటికే ఆమె మృతి చెందింది. ఈ ప్రమాద సంఘటనపై భర్త శ్రీనివాసరావు పెనమలూరు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన వ్యాన్

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం పెరికెగూడెం శివారు బ్రాంచ్ కాలువలోకి వ్యాను దూసుకెళ్లడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రామవరప్పాడు బల్లివారి వీధికి చెందిన విన్నకోట రవి వ్యాను నడుపుకుంటూ మంగళవారం రాత్రి భీమవరం నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్నాడు. అర్ధ రాత్రి పెరికెగూడెం వద్దకు వచ్చేసరికి నిద్రమత్తు కారణంగా ఒక్కసారి కాలువలోని వ్యాను దూసుకుపోయింది. దీంతో డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి హాహాకారాలు చేయడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్.ఐ. రామచంద్రరావుతో పాటు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని 2 గంటల పాటు జేసీబీ సాయంతో ప్రయత్నించడంతో ఎట్టకేలకు బాధితుడు ప్రాణాలతో బయటకు వచ్చాడు. క్షతగాత్రుడిని 108లో గుడివాడ ఆసుపత్రికి తరలించారు.

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

కొనకళ్లకు అభినందన

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: తెదేపా జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావును ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమించడంతో బుధవారం మండల తెదేపా అధ్యక్షుడు వీరపనేని శివరామప్రసాద్ ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

300 మందికి వైద్య పరీక్షలు

పాములలంక(తోట్లవల్లూరు), న్యూస్‌టుడే : మండలంలోని పాములలంక గ్రామంలో బహుజన టీచర్స్ అసోసియేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టరు ఎస్. భరత్‌కుమార్ 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సూరిబాబు, మట్టా రాజేష్, పీటర్సన్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

నాగాయలంక వచ్చిన నగ్నముని

నాగాయలంక, న్యూస్‌టుడే: ప్రముఖ దిగంబర కవి, కొయ్య గుర్రం రచయిత నగ్నముని బుధవారం నాగాయలంకలో వామపక్ష నేత తలశిల లీలా మనోహర్ ఇంటికి వచ్చారు. 1977లో దివిసీమ ఉప్పెన సమయంలో అప్పటి మంత్రి మండలి వెంకటకృష్ణారావుతో కలిసి ప్రభావిత ప్రాంతాల్లో తిరిగి కొయ్య గుర్రం కవితా సంపుటిని రచించానని ఆయన గుర్తుచేసుకున్నారు. అనంతరం కృష్ణానది అందాలను పడవలో ప్రయాణిస్తూ తిలకించారు. కార్యక్రమంలో సజ్జా గోపాలరావు, తలశిల పురుషోత్తం, తలశిల రఘుశేఖర్, రామకృష్ణ, తోట బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జైలుకు వచ్చిన వారిలో మార్పు రావాలి



ప్రసంగిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబూ నాయక్

అవనిగడ్డ, న్యూస్‌టుడే: తొందరపాటులో తప్పు చేసి జైలుకు వచ్చిన ఖైదీలలో పరివర్తన(మార్పు) రావాలని.. మహాత్మా గాంధీజీ స్ఫూర్తితో ఖైదీలలో మార్పు రావాలని ఆయన జయంతిని ఖైదీల సంక్షేమ దినోత్సవంగా ప్రకటించినట్లు సీనియర్ సివిల్ జడ్జి బాబూనాయక్ చెప్పారు. స్థానిక ఉపకారాగారంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రసంగించారు. ఖైదీలు కుటుంబానికి గార్డియన్ వంటి వారని, వారు తప్పుచేసి జైలుకు రావడంతో కుటుంబ గౌరవం దెబ్బతింటుందన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని హితవు చెప్పారు. అనంతరం ఖైదీలకు మిఠాయిలు పంచారు. ఈసందర్భంగా నిర్వహించిన క్యారమ్స్ పోటీల విజేతలకు న్యాయమూర్తి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామ్ ప్రసాద్, డాక్టర్ సురేంద్ర, కారాగారం పర్యవేక్షకుడు వెంకటేశ్వరరావు, రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ వంగర శేషగిరిరావు, ఎన్ఎస్ఎస్ పీవో ఎ. వీరకుమారి, ఏపీపీ సిహెచ్. ప్రసాద్, హెడ్ వార్డర్ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు చేయూత


ఘంటసాలలో నిత్యావసర వస్తువులు అందజేస్తున్న స్వామి, జగదీష్

ఘంటసాల, చల్లపల్లి(న్యూస్‌టుడే): అధిక వర్షాలకు మగ్గాల గుంతల్లో నీరు చేరి నష్టపోయిన 200 మంది చేనేత కార్మికులకు రూ.5 లక్షలు విలువైన నిత్యావసర వస్తువులను పంపిణీ చేసినట్లు అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షులు కందిగట్ల స్వామి, ఏపీ పద్మశాలీ సంఘం ప్రధాన కార్యదర్శి అందె జగదీష్ తెలిపారు. బుధవారం ఘంటసాల, యార్లగడ్డ, పులిగడ్డ తదితర గ్రామాల్లో ఉత్తర అమెరికా పద్మశాలీ సంఘం అసోసియేషన్, అఖిలభారత పద్మశాలీ సంఘం సంయుక్తంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఏపీ పద్మశాలీ సంఘం కన్వీనర్ జీవీ నాగేశ్వరరావు, చేనేత సంఘం నాయకులు వేణుమాధవ్, చిత్తరంజన్‌సాయి, సత్యనారాయణ, శ్రీకాంత్, శీలాప్రసాద్, వెంకటేశ్వర్లు, నాగమల్లేశ్వరరావు, రామ్మోహనరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి


దీక్షలు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వరరావు

గుడివాడ (గ్రామీణం, న్యూస్‌టుడే): పురపాలక సంఘంలో అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయం ఎదురుగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సత్యాగ్రహ దీక్షను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సర్వీస్ రూల్స్‌ను ఏర్పాటు చేయలేదన్నారు. పీఎఫ్ రూపంలో తీసుకున్న నగదు ఇంకా ఉపాధ్యాయుల ఖాతాలలో జమ చేయలేదన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్ ఉపాధ్యాయులు మాదిరిగా ఉద్యోగోన్నతులు, బదిలీలు చేయడం లేదన్నారు. పట్టణ శివారు ప్రాంతాలలో నూతన పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. అర్హులైన వారికి ఎంతో, డీఏలతోపాటు ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. యూటీఎఫ్ దీక్షలకు సీపీఎం నాయకుడు ఆర్‌సీపీ రెడ్డి, ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నీలం ప్రభాకర్, జిల్లా కార్యదర్శి ఎమ్.వి. వరలక్ష్మి, నాయకులు శ్రీనివాస్, కె.చంద్రశేఖర్, కె. సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్


గుడివాడ: గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము


పామర్రు: మహాత్ముని చిత్రపటానికి నివాళి అర్పించిన ఎమ్మెల్యే కుమార్‌రాజా, తదితరులు


పులిగడ్డ గ్రామ పంచాయతీ కార్యాలయంలో..


నాగాయలంక: పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ


అవనిగడ్డ: ఆర్యవైశ్య ప్రముఖుల ఆధ్వర్యంలో..


అవనిగడ్డ: మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు ఆధ్వర్యంలో..


పామర్రు: వాసవీ వృద్ధాశ్రమంలో..

గాంధీజీ సిద్ధాంతాలు నేటికీ అనుసరణీయం

న్యూస్‌టుడే బృందం: జాతీయోద్యమంలో మహాత్మాగాంధీ ఆచరించిన సత్యం, అహింస, సహాయ నిరాకరణ, శాంతి, సత్యాగ్రహం విధానాలు నేటికీ అనుసరణీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం గుడివాడ, అవనిగడ్డ, పామర్రు నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీలు, వివిధ సంస్థల ఆధ్వర్యంలో మహాత్ముని విగ్రహాలు, చిత్రపటాలకు ఘనంగా నివాళులు అర్పించారు. అవనిగడ్డ గాంధీక్షేత్రంలో మహాత్ముడి విగ్రహానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ నివాళులర్పించి మాట్లాడుతూ నేడు అనేక దేశాలు గాంధీజీ సిద్ధాంతాలను ఆచరిస్తున్నాయని చెప్పారు.

✦ సత్యాగ్రహం, అహింసతో ఎంతటి వారినైనా ఎదుర్కోవచ్చని, ఎలాంటి శక్తివంతమైన రాజ్యాలనైనా కూలగొట్టవచ్చని నిరూపించిన యోధుడు మహాత్మాగాంధీ అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ మన దేశంలో పుట్టడం మనకు గర్వకారణం అన్నారు.


చల్లపల్లి: మహాత్మాగాంధీ వేషధారణలో విద్యార్థి


కోడూరులో..


పామర్రు గ్రామీణం: కురుమద్దాలిలో..


పెదపారుపూడి: వెంట్రప్రగడలో..


కూచిపూడి: మొవ్వ సెంటరులో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో...


పామర్రు: మండల పరిషత్ కార్యాలయంలో ..


పమిడిముక్కలలో...


గుడివాడ: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో..


తోట్లవల్లూరులో..



మహాత్మాగాంధీ విగ్రహం వద్ద మహిళా సమాఖ్య నాయకుల ధర్నా

మద్యం దుకాణాలను కుదించండి

చల్లపల్లి, న్యూస్‌టుడే: నూతన మద్యం విధానానికి వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో చల్లపల్లిలోని గాంధీజీ విగ్రహం వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి మాట్లాడుతూ మద్యం దుకాణాల సంఖ్య, సమయం కుదించాలని డిమాండ్ చేశారు. మద్యపానంతో కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం మద్యపానం నియంత్రించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. దుకాణాలను ఉదయం 11.00 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు మాత్రమే నిర్వహించేలా అనుమతులు ఇవ్వాలన్నారు. మహిళలు ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లో అనుమతులు ఇవ్వరాదని కోరారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు కంచర్ల ప్రభుకుమారి, వేములపల్లి నాగేంద్రమ్మ, కుర్రా అరుణకుమారి, అట్లూరి స్వరూప, దాసి కోటేశ్వరమ్మ, సీపీఐ నాయకులు మల్లుపెద్ది బోసు, అట్లూరి వెంకటేశ్వరరావు, సిద్దాబత్తుల వాసు పాల్గొన్నారు.

కల్లుగీత ఆర్థిక కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలి


నిడుమోలులో గాంధీజీ చిత్రపటానికి వినతిపత్రం అందిస్తున్న కల్లుగీత కార్మికులు

నిడుమోలు (కూచిపూడి), న్యూస్‌టుడే: నూతన కల్లుగీత విధానం విడుదల చేసే సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల హామీలు అమలు చేయాలని, తమ డిమాండ్లను పరిష్కరించాలని కార్మికులు కోరారు. ఈమేరకు మహాత్మాగాంధీ చిత్రపటానికి కార్మికులు వినతిపత్రం అందించారు. నిడుమోలులో బుధవారం జరిగిన కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వాకా రామచంద్రరావు మాట్లాడుతూ 1991లో కార్మికులు పోరాడి సాధించుకున్న కల్లుగీత ఆర్థిక కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కల్లు గీసే సమయంలో చెట్టుపై నుంచి పడి చనిపోయిన కల్లుగీత కార్మికుడికి నష్టపరిహారం రూ.10 లక్షలు ఎక్సైజ్ శాఖ నుంచి ఇవ్వాలని, ప్రభుత్వ స్థలాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా తాటి, ఈత విత్తనాలు నాటించాలని, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలలో మాదిరిగా మద్యాన్ని దశల వారీగా నియంత్రించి గీత కార్మికుల జీవనోపాధి మెరుగపర్చాలన్నారు. చెట్లపై కార్మికులకు హక్కు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నిడుమోలు అధ్యక్షుడు పామర్తి శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ నియోజకవర్గంలోని అర్హులైన అభ్యర్థుల నుంచి అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు ఈనెల 10వ తేదీ లోగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసీడీఎస్ గుడివాడ ప్రాజెక్టు కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసేవారు 10వ తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. వయస్సు 2024 జులై 1 నాటికి 21 నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. దరఖాస్తులను ఐసీడీఎస్ ప్రాజెక్టు, తహసీల్దారు కార్యాలయం ఎదురుగా, గుడివాడ-521301 చిరునామాకు పంపాలన్నారు.


ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రత్యేక పూజలు



చల్లపల్లి, న్యూస్‌టుడే: దేవాలయాల పవిత్రతను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. జనసేన పార్టీ పిలుపు మేరకు నగర సంకీర్తనను పురస్కరించుకుని బుధవారం చల్లపల్లి నుంచి మోపిదేవి వరకు పాదయాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ కోట విజయరాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, సర్పంచి పైడిపాముల కృష్ణకుమారి, కూటమి నాయకులు అడపా రాంబాబు, మత్తి వెంకటేశ్వరరావు, రాయపూడి వేణుగోపాలరావు, మాలెంపాటి శ్రీనివాసరావు, పైడిపాముల స్వప్న, సజ్జా చలపతిరావు, నిడమానూరి దిలీప్‌కుమార్, యార్లగడ్డ శ్రీనివాసరావు, మోర్ల శివ తదితరులు పాల్గొన్నారు.

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పిలుపు మేరకు బుధవారం కూటమి నాయకులు ఉల్లిపాలెం గ్రామంలోని శ్రీమన్నారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు మర్రే గంగయ్య, గుడిసేవ సూర్యనారాయణ, యర్రంశెట్టి శ్రీదుర్గా, కొండవీటి సునీత, తోట సోమశేఖరరావు, కోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


ఉల్లిపాలెంలో కూటమి నాయకులు..



జలధీశ్వరస్వామి ఆలయ చరిత్ర పుస్తకావిష్కరణ

ఘంటసాల, న్యూస్‌టుడే: జలధీశ్వరస్వామి వారి ఆలయ చరిత్ర పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జలధీశ్వర స్వామి ఆలయ చరిత్ర పుస్తకాలు 1000 ముద్రించగా స్థానిక యు.వి. స్కూల్‌లో ఎన్నారై గొర్రెపాటి రంగనాథబాబు ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రంగనాథబాబును పలువురు సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకటరామకృష్ణ, గొర్రెపాటి ఫౌండేషన్ ప్రతినిధి కొండపల్లి రామకృష్ణ, డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం


సీతారావమ్మ (పాత చిత్రం)

చల్లపల్లి: చల్లపల్లి మండలం రామానగరం గ్రామానికి చెందిన కాజ సీతారావమ్మ(80) బుధవారం మృతిచెందారు. నాగాయలంకకు చెందిన సుదర్శి మానవత సంస్థ ప్రతినిధులు సీతారావమ్మ కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించడంతో వారు ముందుకు వచ్చారు. సమాచారాన్ని తాడిగడపలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తెలియచేయగా, వైద్యులు వచ్చి ఆమె నేత్రాల నుంచి రెటీనాలను సేకరించారు.

డాక్టర్ గోపాలరావు సామాజిక సేవలు ఆదర్శనీయం

ఘంటసాల: ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ గుత్తికొండ గోపాలరావు చేసిన సామాజిక సేవలు ఆదర్శనీయమని వైజ్‌మెన్‌క్లబ్ జిల్లా ప్రతినిధి టి. నాంచారమ్మ తెలిపారు. బుధవారం చినకళ్లేపల్లిలో వైజ్‌మెన్‌క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ గోపాలరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నాంచారమ్మ మాట్లాడుతూ గోపాలరావు అప్పట్లోనే ఎంబీబీఎస్ చదివి గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఉచిత వైద్య సేవలు అందించేవారని కొనియాడారు. డాక్టర్ గోపారావు సతీమణి గుత్తికొండ కోకిలాంబ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ చిన్నారులకు పలకలు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు.

గాంధీ జయంతి రోజున

విచ్చలవిడిగా మాంసం, మద్యం విక్రయాలు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : గాంధీ జయంతి రోజున మాంసం, మద్యం విక్రయాలు జరపకూడదు. తోట్లవల్లూరు మండలంలో బుధవారం వీటి విక్రయాలు విచ్చలవిడిగా జరిగాయి. వీటిని నిరోధించాల్సిన రెవెన్యూ, పోలీస్, పంచాయతీ యంత్రాంగం ఏమీ పట్టించుకోలేదు. తోట్లవల్లూరులోని ఓ హోటల్‌లో నిల్వ మాంసంతో తయారు చేసిన బిర్యానీ వడ్డించడంతో ఈ విషయం బహిర్గతమైంది. బుధవారం పలువురు ఉపాధ్యాయులు ఒక హోటల్‌కు భోజనం చేయడానికి వెళ్లారు. శాకాహార భోజనం చేయాలని వెళ్లగా హోటల్ నిర్వాహకులు బిర్యానీ ఉందంటూ పెట్టారు. ఆ బిర్యానీ పరిశీలించగా నిల్వ మాంసం వాసన వచ్చింది. దీంతో దానిని తిరస్కరించి శాకాహార భోజనం పెట్టమని చెప్పి తిని డబ్బులు చెల్లించి వెళ్లిపోయామని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా రాజేష్ విలేకరులకు తెలిపారు. తీరా అక్కడ నుంచి బయటకు వచ్చి ఓ బడ్డీ కొట్టు వద్ద కూల్‌డ్రింక్ తాగుతుండగా హోటల్ యజమాని నలుగురిని తీసుకొచ్చి..నా దగ్గర చికెన్ బిర్యానీ తిని డబ్బులు చెల్లించకుండా వచ్చారని గొడవ పడ్డారని తెలిపారు. ఆతరువాత హోటల్ యజమానే ఓ కానిస్టేబుల్‌ను పిలిచి మమ్మల్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వచ్చారని తెలిపారు. సదరు కానిస్టేబుల్ హోటల్‌లో తిన్న బిర్యానీకి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారని రాజేష్ తెలిపారు. గాంధీ జయంతి రోజు మాంసం విక్రయాలు జరపకూడదు..మాంసాహారం అమ్మకూడదు కదా అని మేము ప్రశ్నించగా.. అలా ఏమైనా రూల్ ఉందా అని తిరిగి ప్రశ్నించారని చెప్పారు. కుళ్లిన మాంసంతో బిర్యానీ పెడితే...హోటల్ యజమానిపై చర్యలు చేపట్టకుండా సదరు కానిస్టేబుల్ అతనికే వత్తాసు పలుకుతూ మేము కూడా తిన్నామని..చాలా బాగుందని కితాబు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై ఎస్సై అర్జున్‌రాజును వివరణ అడగ్గా తాను ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తుకు వెళ్లానని, సిబ్బంది ఈ విషయం నా దృష్టికి తీసుకు రాలేదని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్ల స్వాధీనం

పమిడిముక్కల, న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం కూడేరు వద్ద పమిడిముక్కల స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి. శ్రీను తెలిపారు. ఐలూరు నుంచి బందరు, పెడన మండలాలకు ఇసుక తీసుకెళుతున్నట్టు చోదకులు కాగిత నాగేశ్వరరావు, పరసా వాకాలయ్య తెలిపారన్నారు.

ఆరోగ్యానికి క్రీడలు అవసరం

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండడానికి క్రీడలు దోహదం చేస్తాయని గుడివాడ మండల విద్యాశాఖాధికారి 1 ఇందుపల్లి విజయ్ పేర్కొన్నారు. స్థానిక ఏజీకే పాఠశాలలో ఉపాధ్యాయుల షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ సీజన్ 5 విజేతలకు బుధవారం రోటరీ క్లబ్ అధ్యక్షుడు టిఎస్.రాజశేఖర్‌తో కలిసి ఆయన బహుమతులు అందజేశారు. టోర్నమెంట్ విజేతలుగా కోటి నాగేశ్వరరావు, జి.రమేష్‌లు నిలవగా, రెండోస్థానంలో వి. మృత్యుంజయ, డి.చంద్రశేఖర్‌లు నిలిచారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పెద్ది శ్రీనును సత్కరించారు.

జలధీశ్వరుని దర్శించిన కుమార్ విశ్వజిత్


స్వామి వారి జ్ఞాపికతో కుమార్ విశ్వజిత్‌ను సత్కరిస్తున్న వెంకట రామకృష్ణ

ఘంటసాల, న్యూస్‌టుడే: బాల పార్వతీ సమేత జలధీశ్వరస్వామిని రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలో విశేష పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయనను జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకటరామకృష్ణ స్వామి వారి జ్ఞాపికతో సత్కరించారు. ఆలయ చరిత్రను ఆయనకు వివరించారు.


దాత కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న రంగప్రసాద్, అర్చకులు

ఆలయ అభివృద్ధికి వితరణ

కంఠంరాజుకొండూరు(దుగ్గిరాల), న్యూస్‌టుడే: కంఠంరాజుకొండూరు మహంకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన కొమ్మినేని నిష్ఠాథ్ రూ.లక్ష వితరణగా బుధవారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు వంశపారంపర్య ధర్మకర్త దేవభక్తుని రంగప్రసాద్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని అందించి సత్కరించారు. అర్చకులు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నగర పోలీసుల తొలి సారె సమర్పణ



పూజా కార్యక్రమంలో సీపీ రాజశేఖర్‌బాబు దంపతులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే దసరా మహోత్సవాలను పురస్కరించుకొని నగర పోలీసుల తరఫున సీపీ రాజశేఖర్ బాబు దంపతులు తొలి సారెను బుధవారం సంప్రదాయ పద్ధతిలో సమర్పించారు. వన్‌టౌన్ పోలీసుస్టేషను ప్రాంగణంలో రావి చెట్టు వద్ద దుర్గమ్మకు పోలీసు కుటుంబాలతో కలిసి సీపీ దంపతులు పూజ చేశారు. స్టేషను ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అక్కడి నుంచి మేళతాళాలతో అలంకరించిన రథంపై అమ్మవారికి సమర్పించే సారెను దుర్గగుడి టోల్‌గేటు వరకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి కాలి నడకన వచ్చారు. దేవస్థానం ఈవో రామారావు, స్థానాచార్య శివప్రసాద శర్మ సారెను స్వీకరించారు. డీసీపీలు గౌతమి షాలి, ఉదయరాణి, ఉమామహేశ్వర రాజు, కృష్ణమూర్తి నాయుడు, హరికృష్ణ, ఏడీసీపీ రామకృష్ణ, పశ్చిమ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ దంపతులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే ఉత్సవాలు విజయవంతం



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన. పక్కన మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే దసరా ఉత్సవాలను ప్రతి సెక్టారులోని అధికారులు, సిబ్బంది సమన్వయంతో విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన సూచించారు. తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. 26 సెక్టార్లలో పనిచేసే అధికారులు సిబ్బంది ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 9 గంటల వరకు, రాత్రి 9 నుంచి ఉదయం 7 గంటల వరకు మూడు షిఫ్టులుగా నియమించినట్లు తెలిపారు. జిల్లా అధికారులతోపాటు పోలీసు, పంచాయతీరాజ్, రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్, వైద్య ఆరోగ్యం, అగ్నిమాపక, దేవాదాయ శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది ప్రత్యేక బృందాల్లో ఉంటారన్నారు. డ్యూటీ పాయింట్ల వద్ద విధులు నిర్వహించే వారు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

మా దుర్గమ్మ.. బంగారం



నల్లపూసల దండ



మంగళ సూత్రాలు



కిరీటాలు, హారాలు, పాదాలు



పూల జడ



కాసులపేరు



ముత్యాల హారం



వీణ

దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దర్శనం మహిమాన్వితం. దేశ నలుమూలల నుంచి భక్తులు వేల సంఖ్యలో విచ్చేస్తుంటారు. శరన్నవరాత్రుల్లో దుర్గమ్మ తల్లిని దర్శించుకుంటే జీవితం తరిస్తుందని భావిస్తారు. అదే సమయంలో ఉత్సవాల్లో అమ్మవారి అలంకారాలు కూడా ప్రత్యేకతను సంతరించుకుంటాయి. ఇందుకోసం భక్తులు కానుకగా ఇచ్చిన ఆభరణాలతోపాటు సంప్రదాయంగా వస్తున్న వాటిని లోకాలను ఏలే తల్లికి అలంకరిస్తారు. ఆ అలంకారాల్లో ఏ ఆభరణాలు వినియోగిస్తారో తెలుసుకోవాలనే ఆసక్తి భక్తుల్లో ఉంటుంది. **బాలాత్రిపుర సుందరీదేవి:** అభయహస్తాలు, బంగారు పూలజడ, కంఠాభరణాలు, బంగారు వడ్డాణం. **గాయత్రీదేవి:** స్వర్ణ పంచముఖాలు, బంగారు అభయ హస్తాలు, పచ్చల హారం, కంఠాభరణాలు. **అన్నపూర్ణాదేవి:** స్వర్ణ పాత్ర, బంగారు త్రిశూలం, హస్తాలు. **లలితా త్రిపుర సుందరీదేవి:** స్వర్ణ కిరీటం, కంఠాభరణాలు, స్వర్ణాభరణాలు, అభయహస్తాలతో అలంకరిస్తారు. **మహాచండీ దేవి:** సింహవాహనం, కంఠాభరణాలు, ఖడ్గం, కర్ణాభరణాలు, హస్తాలు. **మహాలక్ష్మీదేవి:** గజరాజు, అభయ హస్తాలు, ధనరాశులు, వడ్డాణం, కంఠాభరణాలు, కర్ణాభరణాలు. **సరస్వతీదేవి:** బంగారు వీణ, స్వర్ణహస్తాలు, పగడాల హారం, వడ్డాణంతో అలంకరిస్తారు. **దుర్గాదేవి:** శార్దూల వాహనం, బంగారు త్రిశూలం, సూర్యచంద్రులు, శంఖుచక్రాలు. **మహిషాసుర మర్దినిదేవి:** సింహ వాహనం, బంగారు త్రిశూలం, స్వర్ణ ఖడ్గం, కంఠాభరణాలు, కర్ణాభరణాలు. **రాజరాజేశ్వరిదేవి:** స్వర్ణాభరణాలు, అభయహస్తాలు, చెరకుగడతో అలంకరిస్తారు. కాసుల పేరు, బంగారు పూలజడ, దేవిపాదాలు అమ్మవారి రూపాన్ని అనుసరించి వినియోగిస్తారు.

- న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

నేటి అలంకారం

3-10-2024, గురువారం

శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి



"అరుణకిరణ జాలై రంజితా సావకాశా
విధృత జపవటీకా పుస్తకా భీతిహస్తా
ఇతర వరకరాఢ్యా ఫుల్లకల్హారసంస్థా
నివసతు హృదిబాలా నిత్యకల్యాణశీలా"

దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో మొదటి రోజు జగన్మాత దుర్గాదేవి బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను ఆవహించి ఉండే శక్తి స్వరూపమే త్రిపుర అని త్రిపురోపనిషత్ ఉపనిషత్తు చెబుతోంది. 'స్వర్గ, భూ, పాతాళా' అనే త్రిపురాల్లో ఉండే శక్తి చైతన్యాన్ని త్రిపురగా వర్ణిస్తారు. శ్రీచక్రంలో ఉండే దేవతల్లో అమ్మవారు మొదటి దేవత త్రిపురసుందరీదేవియే. 'శ్రీ' విద్యలో మొదటి దేవి బాల అందుకే ఉపాసకులు ఈ విద్యను పొందే వేసేవారు మొదట బాల మంత్రాన్ని ఉపాసన చేయడం జరుగుతుంది. త్రిపుర సుందరీ దేవి అభయహస్తముద్రతో చెరుకుగడ ధరించి ఉంటుంది. మనసు, బుద్ధి, అహంకారం ఆమె ఆధీనంలో ఉంటాయి. ఆమెను ధ్యానించడంతో సమస్త మనోవికారాలు తొలగి నిత్యసంతోషం కలుగుతుందని భక్తుల నమ్మకం. బాలాత్రిపుర సుందరీ దేవిని అరుణవర్ణ వస్త్రాలు ధరించి ఎర్రని పూలతో పూజ చేసి కట్టెపొంగలిని నైవేద్యంగా సమర్పిస్తారు.

సైబర్ నేరగాళ్ల ఆటకట్టించమ్మా..!

విజయవాడ పోలీసుల వినూత్న ప్రచారం

విజయవాడ నేర వార్తలు, న్యూస్‌టుడే: 'దసరా ఉత్సవాల్లో పది రోజుల పాటు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే అమ్మవారి భక్తులకు సైబర్ నేరాలపై అవగాహన కలిగిస్తాం' పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ప్రకటించారు. బుధవారం సాయంత్రం సైబర్ నేరస్థులను అమ్మవారికి అప్పగించే వినూత్న కార్యక్రమం చేపట్టారు. నేరాలకు పాల్పడే వ్యక్తిని పట్టుకుని దుర్గమ్మ ఆలయానికి మేళతాళాల మధ్య తీసుకు వస్తూ 'దుర్గమ్మా.. సైబర్ నేరగాళ్ల ఆట కట్టించు అంటూ వేడుకున్నారు. కర్రలపై... నేరగాడిని, పోలీసు తీసుకుస్తున్న తీరు అందరినీ ఆకర్షించారు. డప్పుల హోరులో ఎత్తైన కాళ్లపై నడుచుకుంటూ వస్తున్న పోలీసు వేషధారి.. 'ఐ యామ్ సైబర్ సిటిజన్' అంటూ ప్లకార్డు పట్టుకోవడం ఆకట్టుకుంది. ఉత్సవాల సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ సైబర్ నేరాలపై అవగాహన కలిగించేలా సీపీ సమక్షంలో ప్లకార్డులు చేత పట్టి చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. వీరిని సీపీ అభినందించారు.



'రా... దుర్గమ్మ దగ్గరకు రా' అని సైబర్ నేరగాడిని లాక్కుని వెళుతున్న పోలీస్ వేషధారి

కనకదుర్గ పైవంతెన వైపు అనుమతి లేదు

గొల్లపూడి, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని భారీ, గూడ్స్ వాహనాలను విజయవాడ నగరం, కనకదుర్గ పైవంతెన వైపు అనుమతించడం లేదని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. గొల్లపూడి వైజంక్షన్ వద్ద నుంచి వాహనాలను మళ్లిస్తున్నట్లు వెల్లడించారు. ఏలూరు, గుంటూరు వైపు వెళ్లే వాహనాలు కబేళా, సీవీఆర్ పైవంతెన, పైపులరోడ్డు, రామవరప్పాడు మీదుగా వెళ్లాలని సూచించారు. ఇబ్రహీంపట్నం నుంచి గొల్లపూడి వరకు బోర్డులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

వాహనాల మళ్లింపు వివరాల ఫ్లెక్సీ



రైళ్లన్నీ బెజవాడ వైపే..!



దేశం నలుమూలల నుంచి భక్తుల రాక

దసరా వేళ.. సౌకర్యాలు పెంచాలి

విజయవాడ, న్యూస్‌టుడే

బెజవాడలో నిర్వహించే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు దేశ నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. నిత్యం వందలాది రైళ్లు విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఎక్కువ మంది వీటినే ఆశ్రయిస్తుంటారు. ఏ బండి చూసినా.. కిక్కిరిసిపోతుంది. రద్దీకి అనుగుణంగా ఇక్కడి స్టేషన్‌లో వసతులు పెంచాల్సి ఉంది. అరకొర సౌకర్యాలు ప్రయాణికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. జేబుదొంగల సమస్య అధికంగానే ఉంది. రైల్వే అధికారులు ఒకవైపు చర్యలు తీసుకుంటున్నా.. పూర్తిస్థాయిలో ఫలితాలు లభించడం లేదు.

రోజువారీ ప్రయాణికుల రాకపోకలు : సీజన్‌లో రెండు లక్షలు, అన్‌సీజన్‌లో లక్ష వరకు

రైళ్లు : 250కి పైగానే..

దొంగల భయం..

విజయవాడ రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కేందుకు వేచి ఉండే ప్రయాణికులకు దొంగల బెడద తప్పడం లేదు. కళ్లుమూసి తెరిచేలోపే.. బ్యాగులు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను చోరీ చేస్తున్నారు. బుకింగ్ కౌంటర్లలో హడావుడిగా టిక్కెట్లు తీసుకునే వారిని లక్ష్యంగా చేసుకుంటారు. వారి జేబులను కత్తిరించి, పర్సులు నొక్కేస్తున్నారు. అన్ని ప్లాట్‌ఫారాల్లోనూ ఇలాంటి పరిస్థితి నెలకొంది. ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.



నాసిరక ఆహార పదార్థాలు

రైల్వేస్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారాలలో నాసిరకం ఆహార పదార్థాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అధికారులు తనిఖీలు చేస్తున్నా పెద్దగా ఫలితాలు ఉండడం లేదు. మార్పు కనిపించడం లేదు. ప్రయాణికులు ఆర్థికంగా నష్టపోతున్నారు. అనారోగ్యంపాలవుతున్నారు. నాసిరకం దందాకు అడ్డుకట్ట వేయాలి.

తక్కువ ధరకే అందించాలి

రైలు ప్రయాణికుల్లో అత్యధిక శాతం పేద, మధ్య తరగతి వర్గాలే ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. తక్కువ ధరకే అందించే 'జనాహార్' స్టాళ్లు ఎక్కువగా లేవు. దసరా రద్దీని దృష్టిలో పెట్టుకొని అన్ని ప్లాట్‌ఫారాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి.

అదనపు రైళ్లు నడపరూ..

దసరా, దీపావళి, క్రిస్మస్ పండగలను దృష్టిలో పెట్టుకొని అదనంగా ప్రత్యేక రైళ్లు నడపాలి. నిర్వహణ పనుల దృష్ట్యా రైల్వే శాఖ ఇప్పటికే ఉన్న వాటిలో కొన్నింటిని రద్దు చేసింది. రద్దీ ఎక్కువగా ఉండే ఈ సీజన్‌లో.. ప్రత్యేక రైళ్లు నడపడం ద్వారా ప్రయాణికులకు సౌకర్యావంతంగా ఉంటుంది. ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది. డిమాండ్ అధికంగా ఉండే హౌవ్‌డా, బెంగళూరు, సికింద్రాబాద్ మార్గాల్లో సర్వీసులు పెంచాలి.



అనదపు కౌంటర్లు అవసరం

ప్రధాన రిజర్వేషన్ కార్యాలయంలో.. దసరా పండగ పది రోజులూ అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలి. రద్దీ ఎక్కువ ఉంటున్నా.. కౌంటర్లు ఏర్పాటు చేయడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అన్ని రైళ్లలో రిజర్వేషన్లు పూర్తవడంతో తత్కాల్ టికెట్లకు డిమాండ్ పెరిగింది. అవి పక్కదారి పట్టకుండా రైల్వే పోలీసులు నిఘా ఉంచాలి.

నిలువ దోపిడీకి అడ్డుకట్ట పడేనా..

రైలు దిగి ఇంటికి చేరుకునే ప్రయాణికులను. . కొందరు ఆటో వాలాలు నిలువదోపిడీ చేస్తున్నారు. రైల్వేస్టేషన్ ట్రాఫిక్ బూత్‌లో సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో.. ఎక్కువ ధరలు వసూలు చేస్తున్నారు. అదేమని అడిగితే.. ఎదురు దాడి చేసే పరిస్థితులు ఇక్కడున్నాయి. డ్రైవర్లందరూ ఏకమై.. ప్రయాణికుల మీదకు వెళ్లి భయాందోళనలకు గురిచేస్తున్నారు. రాత్రి సమయాల్లో ఈ దోపిడీ తారస్థాయిలో ఉంటోంది.

ఉరకలెత్తిన ఉత్సాహం.. అడుగడుగునా నీరాజనం



స్కౌట్స్ విద్యార్థులతో చంద్రబాబు



పారిశుద్ధ్య కార్మికుల హర్షాతిరేకాలు



బాబుకు గజమాలతో సత్కారం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటిసారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మచిలీపట్నం రావడంతో తెదేపా శ్రేణులు, కూటమి నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. నగరంలోని ఆంధ్ర జాతీయ కళాశాలలో హెలిప్యాడ్ దిగిన దగ్గర నుంచి ప్రజావేదిక సభ నిర్వహించి తితిదే కల్యాణ మండపానికి వచ్చేవరకు రహదారి పొడవునా కూటమి నాయకులతోపాటు ప్రజలు విజయ సంకేతం చూపుతూ, నమస్కరించారు. చరవాణీలు పట్టుకుని చిత్రాలు తీస్తూ కనిపించారు. వేదిక వద్ద సభా ప్రాంగణం అంతా నిండిపోవడంతో మండపంలోని హాల్లో డిజిటల్ తెర ఏర్పాటు చేసి కుర్చీలు వేయగా అది కూడా నిండిపోయింది. ముఖ్యమంత్రి నగరంలో దీర్ఘకాలిక సమస్య అయిన డంపింగ్‌యార్డుతోపాటు కోనేరు సెంటరులో సుందరీకరణ పనులు పరిశీలించారు. స్వచ్ఛ కార్యక్రమాల్లో పాల్గొన్న స్కౌట్స్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఐవీఆర్ఎస్ ద్వారా నగరంలోని సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంతోపాటు ప్రభుత్వ వైద్యకళాశాలకు పింగళి నామకరణం చేసేందుకు కృషి చేస్తామని చెప్పడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వివిధ సంస్థలు, ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలోని వివిధ డివిజన్‌లలో పనిచేస్తున్న స్వచ్ఛ సేవకులను సత్కరించి, పురస్కారాలు అందజేశారు. పురస్కారాలు అందుకున్న కార్మికులు ప్రభుత్వతీరు, వారికి కల్పించిన వసతులపై చంద్రబాబు సమక్షంలోనే వెల్లడించారు.

కుటుంబసభ్యుల్లా చూశారు



తెల్లవారక ముందే లేచి నగరంలోని ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతుంటాం. ఇబ్బంది అయినా సరే నగర పరిశుభ్రత కోసం కృషి చేస్తాం. అలాంటి మమ్మల్ని ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల్లా చూడటం ఎంతో సంతోషంగా ఉంది. వరదల సమయంలో విజయవాడలో పనిచేయడానికి వెళ్లిన సమయంలో ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ, అన్ని వసతులు అందించేలా అధికారులను ఆదేశించారు. 75 ఏళ్ల వయసున్న వ్యక్తి నీళ్లలో తిరుగుతూ కన్న తండ్రి పిల్లలను కంటికి రెప్పలా కాపాడినట్లు ముఖ్యమంత్రి అలా ప్రజలను కాపాడుతూ వస్తున్నారు. అలాంటి ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్వచ్ఛ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉంది. **- ఝాన్సీలక్ష్మి**

భరోసా ఇచ్చారు



మచిలీపట్నం నుంచి 200 మంది వరకు పారిశుద్ధ్య కార్మికులు విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవలు అందించేందుకు వెళ్లాం. కొత్త ప్రాంతమైనా సరే ముఖ్యమంత్రి ఇచ్చిన భరోసాతో పని కష్టమైనా ఇష్టంగా చేయగలిగాం. వరదల్లో ముఖ్యమంత్రి మా ముందు ఉండి నడిపించడం సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపుతో తెదేపా కార్యకర్తలు కూడా మాతోపాటు పనిచేశారు. అభివృద్ధి కోసం తపించే ముఖ్యమంత్రి చేతులమీదుగా పురస్కారం అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను. **- విజయలక్ష్మి**

ఆరోగ్య పరీక్షలు చేయించారు: దుర్గాప్రసాద్



నాలాంటి కార్మికులు వేలాది మంది విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో పనిచేశాం. అక్కడకు వెళ్లే ముందు వసతులు ఎలా ఉంటాయో అని ఆందోళన చెందాం. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో భోజనంతోపాటు అన్ని వసతులు కల్పించారు. అక్కడ ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతోపాటు, తిరిగి మచిలీపట్నం వచ్చిన తరువాత కూడా మళ్లీ పరీక్షలు చేశారు. ఇలా ముఖ్యమంత్రి కార్మికులతో ప్రత్యేక శ్రద్ధ చూపారు.

చంద్రబాబు లెజెండ్: శ్రీనివాసరావు



నేను 23 ఏళ్లుగా పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాను. వరద ప్రభావిత ప్రాంతాలను చూస్తే మాకే భయం వేసింది. అలాంటి చోట్ల ముఖ్యమంత్రి పర్యటించారంటే ఆయన పనితీరు అర్థం చేసుకోవచ్చు. వరద నీళ్లలో కూడా మావద్దకు వచ్చి తమ్ముళ్లూ ఎలా ఉన్నారని అడగడం ఎంతో సంతోషంగా ఉంది. నాకు 52 ఏళ్లు. అనేక అనారోగ్య సమస్యలున్నాయి. ముఖ్యమంత్రి వయసు 75 ఏళ్లయినా లెజెండ్‌లా పనిచేస్తున్నారు. మరో పదేళ్లపాటు ఆయనే ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నాను.



సీఎం నుంచి స్వచ్ఛత అవార్డులు అందుకున్న పారిశుద్ధ్య కార్మికులు



రంగుల ముగ్గుతో స్వచ్ఛతా హీ సేవ అలంకారం



పారిశుద్ధ్య కార్మికురాలిని ఆప్యాయంగా పలకరిస్తూ..

ఆక్రమణలు తొలగించాలి

స్వచ్ఛ చల్లపల్లి కోసం పదేళ్లుగా నిరంతర కార్యక్రమాలు చేస్తున్నాం. అలా గ్రామాల్లో అందరూ ఐక్యంగా ఉంటూ స్వచ్ఛపల్లెల కోసం కృషి చేస్తే స్వచ్ఛభారత్ కల సాకారం అవుతుంది. డ్రైన్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వల్ల ఏర్పడుతున్న సమస్యలను గుర్తించాం. వాటిని తొలగించి మురుగు పారేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడంతో పాటు అధికారికంగా చేపట్టే పనులకు నిధులు విడుదల చేయాలని కోరుతున్నాం. **- డీఆర్‌కే ప్రసాద్, స్వచ్ఛ చల్లపల్లి రథసారథి**



మేమున్నామనీ వరద బాధితుల సహాయార్థం ఈనాడు రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్ష విరాళం అందజేసిన కోనేరు ఛారిటబుల్ ట్రస్టు ప్రెసిడెంట్ కె.నరేంద్రబాబు, ట్రస్టు కార్యవర్గ సభ్యులు. – ఈనాడు, అమరావతి

పట్టభద్రులూ.. ఓటు నమోదు చేసుకోండి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదుకు నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీవో, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో ఓటరు దరఖాస్తు ఫారం-18 పూర్తి చేసి.. విద్యార్హతలకు సంబంధించిన నకళ్లు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. రెండు ఉమ్మడి జిల్లాల్లో 188 సహాయ ఓటరు నమోదు అధికారులు, 104 డిజిగ్నేటెడ్ అధికారులు, 119 అదనపు డిజిగ్నేటెడ్ అధికారులు అందుబాటులో ఉన్నారన్నారు. పట్టభద్రులు నవంబర్ 6వ తేదీ లోపు ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని చెప్పారు.